

సుండుపల్లె మండలం పింఛా పాఠశాలలో వైసీపీ అల్లరి మూకలను గదిలోకి రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు

- టీడీపీ మద్దతుదారుల విజయకేతనం
- 2183 స్కూళ్లలో కమిటీలు పూర్తి
- 25 స్కూళ్లు పెండింగ్
- సుండుపల్లెలో వైసీపీ నాయకుల వీరంగం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు (పాఠశాల నిర్వహణ కమిటీలు) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. జిల్లాలో 2183 స్కూళ్లకు గాను 1637 పాఠశాలల్లో ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకున్నారు. 531 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. 25 స్కూళ్లలో ఎన్నికలు జరగలేదు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారు. ఎన్నికల్లో వైసీపీ మద్దతుదారులు ఎక్కడా ప్రభావం కూడా చూపలేకపోయారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా పాఠశాలలు సమర్థవంతంగా నిర్వహించేందుకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (పాఠశాల నిర్వహణ కమిటీ)లకు బాధ్యతలు అప్పగించనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ కమిటీలు పాఠశాల పనితీరును పర్యవేక్షించడం, పాఠశాలల అభివృద్ధికి కేటాయించిన నిధుల వినియోగం, ఆర్‌టీఐ నిబంధనల అమలును పర్యవేక్షించడం, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ట్రాక్ చేయడం, పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించడం చేయాలి.

జిల్లాలో 2183 పాఠశాలలకు స్కూల్ కమిటీ ఎన్నికల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా 1637 పాఠశాలల్లో స్కూల్ కమిటీలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 531 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకా 25 పాఠశాలలకు స్కూల్ కమిటీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఇందులో 16 స్కూళ్లలో ఎన్నిక జరగడానికి అవసరమైన సభ్యులు హాజరు కాకపోవడంతో (కోరం లేక) కమిటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. మిగిలిన 9 పాఠశాలలు విద్యార్థులు లేక మూతపడ్డాయి.



సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

కూటమి మద్దతుదారుల విజయకేతనం

జిల్లాలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మద్దతుదారుల (కూటమి) విజయకేతనం ఎగుర వేశారు. ఈనెల 1వ తేదీ నుంచే ఈ కమిటీ ఎన్నికకు సంబంధించి ప్రక్రియ మొదలు కావడంతో కూటమి నాయకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. నిబంధనల మేరకు తల్లిదండ్రుల వివరాలను సేకరించి తమకు అనుకూలమైన వారిని ఎన్నిక చేసుకోవడంలో విజయం సాధించారు. 531 పాఠశాలల్లో ఎన్నికలు జరిగినప్పటికీ అక్కడ కూడా కూటమి మద్దతుదారులే పూర్తి స్థాయిలో పైచేయి సాధించారు. ఎక్కడా వైసీపీ మద్దతుదారులు కనీసం ప్రభావం చూపలేకపోయారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో ప్రభుత్వం తీసుకున్న తలాతోక లేని నిర్ణయాల వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమైన విషయం తెలిసిందే.

- వాల్మీకిపురం మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం 63 పాఠశాలలు ఉండగా 54 పాఠశాలల్లో ఏకగ్రీవం అయ్యాయి. 9 స్కూళ్లలో ఎన్నికలు జరిగాయి. వాల్మీకిపురం వెస్ట్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు తనకిష్టమొచ్చినట్లు కమిటీ పేర్లు రాయడంతో టీడీపీ నాయకులు ఆ ఉపాధ్యాయుడిని నిలదీశారు.
- పీలేరు మండలంలో 76 పాఠశాలల్లోనూ ప్రశాంతంగా కమిటీ ఎన్నికలు జరిగాయి. రాజకీయంగా సున్నితమైన గ్రామాల్లోనూ వైసీపీ నాయకులు టీడీపీ నాయకులకు సహకరించడంతో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.
- మదనపల్లె మండల పరిధిలో 137 పాఠశాలలకు గానూ 135 స్కూళ్లలో ఎన్నికలు పూర్తి అయ్యాయి.
- కలకడ మండలంలో 52 పాఠశాలలకు గానూ 51 చోట్ల ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. కలకడ ఆదర్శ పాఠశాలలో తగిన సంఖ్యలో తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది.
- తంబళ్లపల్లె మండలంలో 68 పాఠశాలలకు గానూ 66 స్కూళ్లలో ఏకగ్రీవంగా కమిటీలు ఎన్నికయ్యాయి. కన్నెమడుగు హైస్కూల్, ఎద్దులవారికోట ప్రైమరీ స్కూల్‌లో తల్లిదండ్రుల కోరం లేక ఎన్నిక వాయిదా పడింది.
- పుల్లంపేట మండలంలో 63 స్కూళ్లకు గానూ 61 స్కూళ్లలో ఏకగ్రీవమయ్యాయి. బావికాడపల్లె జడ్పీ హైస్కూల్, వల్లూరుపల్లె ప్రాథమిక ఉన్నత పాఠశాలలో సభ్యులు చేతులెత్తే పద్ధతి ద్వారా కమిటీని ఎన్నుకున్నారు.
- లక్కిరెడ్డిపల్లె మండలంలో 69 పాఠశాలలకు గానూ 68 చోట్ల కమిటీలు ఎన్నికయ్యాయి. దెయ్యాలవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో మాత్రం ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎన్నిక జరగలేదు.
- బి.కొత్తకోటలో 68 పాఠశాలలకు గానూ 67 చోట్ల ఎటువంటి సమస్యలు లేకుండా కమిటీ ఎన్నిక జరిగింది. బడికాయలపల్లె జడ్పీ హైస్కూల్‌లో కమిటీ ఎన్నిక పెండింగ్‌లో ఉంది.
- ములకలచెరువు మండలంలో 60 స్కూళ్లు ఉండగా అన్ని చోట్లా ప్రశాంతంగా కమిటీలు ఎన్నికయ్యాయి. బుకకాయలకోట జడ్పీ హైస్కూల్‌లో ఓటింగ్ జరిగింది.
- రాయచోటి మండలంలో 106 పాఠశాలలకు గానూ 93 ఏకగ్రీవమయ్యాయి. 13 స్కూళ్లకు ఎన్నికలు జరిగాయి. రాయచోటి అర్బన్ పరిధిలో 42 స్కూళ్లు ఉండగా అందులో 36 స్కూళ్లకు కమిటీలు ఏకగ్రీవం అయ్యాయి. మార్కెట్ ఉర్దూ స్కూల్, అలీమాబాద్ ఉర్దూ, డైట్ హైస్కూల్, డైట్ ప్రైమరీ స్కూల్, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, ఎగువఅబ్బవరం పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. రాయచోటి రూరల్ పరిధిలో 64 పాఠశాలలకు 57 ఏకగ్రీవం అయ్యాయి. ఏపీ గిరిజన రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ఏపిలవంకపల్లె జడ్పీ హైస్కూల్, బాలిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాల, చెర్లోపల్లె, బోయపల్లె పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.
- సిద్దవటం మండలంలో 49 స్కూళ్లకు గానూ 41 ఏకగ్రీవం అయ్యాయి. 8 చోట్ల ఎన్నికలు జరిగాయి.
- పెద్దమండెం మండలంలో 60 స్కూళ్లకు గానూ 59 పాఠశాలల్లో కమిటీలు ఎన్నికయ్యాయి. 57 చోట్ల ఏకగ్రీవం అయ్యాయి. మూడు స్కూళ్లలో కోరం లేక ఎన్నిక వాయిదా పడింది.
- సుండుపల్లె మండల వ్యాప్తంగా 88 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో గురువారం ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. పింఛా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలకు వచ్చిన వారిని వైసీపీ మద్దతుదారులు అక్కడి నుంచి పంపించే ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు అక్కడికి చేరుకుని ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టారు. అయితే అక్కడికి వైసీపీ మండల అధ్యక్షుడు రామస్వామిరెడ్డి, కొంతమంది వైసీపీ నాయకులతో కలిసి వీరంగం సృష్టించారు. తమకు మద్దతు లేకపోయినా తాము చెప్పిన వారినే చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా నియమించాలని పట్టుబట్టి అక్కడ ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసినట్లు కూటమి నేతలు తెలిపారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు యాజమాన్య కమిటీ ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. చివరికి టీడీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- సంబేపల్లె మండలంలో 62 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలల్లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలతో కలిపి పదిచోట్ల పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయి. సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల మోడల్ స్కూల్‌లో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను గురువారం డీఈవో పరిశీలించారు.

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

కడప జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

9, 10, 11, తేదీల్లో కడప జిల్లా, కొత్త బస్‌స్టాండ్ ప్రక్కన, ఎస్.పి బంగళా ఎదురుగా, హరితా హోటల్, ఎపి టూరిజం, కడప నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). **ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారుకూడా చేయించుకోవచ్చును.** ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేళ ఈ క్యాంపుకు రాలేకపోయినవారు **హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో** గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 20 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


రాయచోటి (కలెక్టరేట్), అగస్టు 8: జిల్లాలో హౌసింగ్ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పథకంపై సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మున్సినల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 78,221 ఇళ్లు కేటాయించారని, వాటిలో 82 శాతం పనులు మొదలు పెట్టారని మిగిలినవి కూడా త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదివరకే ఈ పథకంలో రిజిస్టర్ అయిన వారు కొత్త పథకంలోకి మారడనికి వీలు లేదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నదియాదేవి, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఉపాధి హామీ కూలీలు పస్తు...!

- రెండున్నర నెలల నుంచి అందని బిల్లులు
- కూలీల ఎదురు చూపులు
- తంబళ్లపల్లె నియోజకవర్గంలో రూ.8.02 కోట్ల బకాయిలు



ములకలచెరువు మండలంలో జరుగుతున్న ఉపాధి పనులు

ములకలచెరువు, ఆగస్టు 8: గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలు పస్తు ఉంటున్నారు. రెండున్నర నెలల నుంచి ఖాతాల్లోకి కూలీ డబ్బులు జమ కావడం లేదు. దీంతో వేతనాలు ఎప్పుడు పడతాయో నని కూలీలు ఎదురు చూస్తున్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.8.02 కోట్లు కూలీలకు అందాల్సి ఉంది. రాష్ట్రంలోనే వెనకబడిన నియోజకవర్గంగా పేరొందిన తంబళ్లపల్లెలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నియోజవర్గంలోని ములకలచెరువు, కురబలకోట, బి.కొత్తకోట, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె మండలాల్లో ప్రతిరోజూ 9 వేల మంది దాకా ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. హార్టికల్చర్, ఫారం పండ్స్, ఫీడర్ ఛానల్స్, రైతు పొలాల్లో బౌండరీ ట్రెంచ్‌లు తదితర పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు అందడం లేదు. ఈ ఏడాది మే 20వ తేదీ నుంచి కూలీల ఖాతాల్లోకి బిల్లులు జమ కావడం లేదు. ప్రతిరోజూ పనులు చేస్తున్నా వేతనాలు ఖాతాల్లోకి పడకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనులకు వెళితే కానీ పూట గడవని కూలీలు వేతనాలు అందక పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఇంట్లో సరుకులు కూడా కొనలేని పరిస్థితి నెలకొంది. బిల్లుల కోసం ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ప్రయోజనం లేకుండాపోయింది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి బిల్లులు విడుదలకు బడ్జెట్‌లో కేటాయింపులు, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల కారణంగా నిధులు విడుదల ఆలస్యం అయిందని అధికారులు చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికలకు ముందు కేంద్రం ఓటాన్ బడ్జెట్ ప్రవేశపెట్టిందని, మళ్లీ ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి కేటాయింపుల కోసం కొంత సమయంలో పట్టడంతో వేతనాల విడుదల ఆలస్యం అయిందని చెబుతున్నారు.

మండలాల వారీగా ఉపాధి బకాయిలు

మండలం	08-08-2024 నాటికి బకాయిలు
బి.కొత్తకోట	97,02,825
కురబలకోట	68,72,850
ములకలచెరువు	1,43,82,000
పెద్దమండ్యం	2,25,86,700
పెద్దతిప్పసముద్రం	1,11,72,225
తంబళ్లపల్లె	1,54,89,675
మొత్తం	8,50,29,825

రెండు రోజుల్లో నగదు జమ

- మధుబాబు, డ్వామా ఏపీడీ, తంబళ్లపల్లె క్లస్టర్

ఉపాధి కూలీలకు వేతనాలు మంజురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రెండు రోజుల్లోగా పనిచేసిన కూలీల ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది.

బాలల సంరక్షణే ధ్యేయం

- బాలల పరిరక్షణ కమిటీ సభ్యుడు

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 8: అంగన్‌వాడీ సెంటర్లలో బాలల సంరక్షణే మా ధ్యేయం అని బాలల సంరక్షణ సమితి సభ్యుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, అంబేద్కర్ గురుకులం అధికారులు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, డీపీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శశికళ తదితర అధికారులు పాల్గొన్నారు.

రామన్న చేతి నుంచి జాలువారిన అంజన్న

సకలపాప హరణం అంజన్న దర్శనం
రేపటి నుంచే శ్రావణ మాసోత్సవం



చక్రాయపేట, ఆగస్టు 8: రాయలసీమ జిల్లాల్లో ప్రసిద్ధ ప్రముఖ గండి క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలు అంగరంగ వైభవోపేతంగా జరనున్నాయి. ఇక్కడి అంజన్న విగ్రహం స్వయానా శ్రీరామచంద్రుడు చిత్రించారు. ఇలాంటి స్వామిని దర్శించడంతో సకలపాపాలు తొలగి, అష్టఐశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. ఏటా గండి క్షేత్రంలో శ్రావణ మాసోత్సవాలు జరగడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మొదటి శ్రావణ శనివారం 10వ తేదీ, రెండో శనివారం 17న, మూడో శనివారం 24న, నాలుగో శనివారం 31వ తేదీ నిర్వహిస్తున్నారు. శ్రావణ మాసంలో గండి క్షేత్రం భక్తులతో కోలాహలంగా, విద్యుత్ అలంకరణలు, చలువ పందిళ్లు, చక్కభజనలు, కోలాటాలు, హరికథా కాలక్షేపాలు నిర్వహిస్తారు. ఉత్సవాలు తిలకించడానికి రాయల సీమ నుంచి భారీ ఎత్తున భక్తులు పాల్గొంటారు. పులివెందుల, రాయచోటి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, కమలాపురం, కదిరి నుంచి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు.


గండి పేరు ఎలా వచ్చిందంటే...

గండి మొదలుకొని తిరుమల వరకు శేషాచలం అడవులు వ్యాపించాయి. ఇక్కడ ఉన్న కొం డకు ఎక్కడా తెగువ లేదు. గండి వద్ద రెండు కొండల మధ్య తెగువ ఏర్పడి ఉండడంతో ఈ ప్రాంతాన్ని గండి అని పిలుస్తారు. ఇక్కడ అంజన్న కొలువై ఉండడంతో గండి క్షేత్రంగా విరాజిల్లుతోంది. ఈ కొండల నుడుమ అంజన్న కాళ్లుకడిగి పాపాఘ్ని నది ప్రవహిస్తోంది. ఫలితంగా ఈ నదిలో స్నానం చేసి అంజన్నను దర్శించుకుంటే సర్వపాపాలు తొలగి అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ పాపాఘ్ని నది కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నందిగామ కొండల్లో పుట్టి అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ప్రవహించి జిల్లాలోని గాలివీడు మండలంలో కలుస్తుంది. ఇక్కడ రెండు కొండల నడుమ బంగారు మకర తోరణం ఏర్పాటు చేశారని అది పుణ్యాత్ములకు మాత్రమే కన్పిస్తుందని ప్రతీతి. గండి క్షేత్రాన్ని దర్శిం చుకున్న బ్రిటీష్ కలెక్టర్ సర్ థామస్ మన్రోకు ఆ మక ర తోరణం కనిపించిందని కడప గెజిట్‌లో పేర్కొన్నారు. ఈ క్షేత్రంలో 41 రోజులు నిద్రించి అంజన్నను పూజిస్తే అనుకున్న పనులు నెరవేరుతాయని నమ్మకం.

వైభవోపేతంగా ఉత్సవాలు నిర్వహిస్తాం

గండి క్షేత్రంలో జరిగే శ్రావణ మాసోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తామని దాదాపు రూ.20కోట్లతో ఆలయ నిర్మాణం, ప్రహరీ, రాజగోపురం, చక్కటి శిల్పనైపుణ్యాలతో దాదాపు 130స్తంభాలతో నిర్మిస్తున్నారు. గుడి నిర్మాణం అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం.

సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య



గండి క్షేత్రం వ్యూ (ఫైల్)

అంజన్న చరిత్ర

గండి ప్రాంతంలో అంజన్న కొలువై ఉండడానికి అనేక కథ నాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అందులో ఒకటి రావణాసురుడు సీతమ్మను అపహకరించినపుడు రామలక్ష్మణులు లంకకు పయనమయ్యారు. మార్గమధ్యలో గండి సమీపాన వాయుదేవుడు నివాసం ఉండేవాడు. వాయుదేవుడు శ్రీరామ లక్ష్మణులను అక్కడ బసచేయమని కోరగా, తిరుగు ప్రయాణంలో మీ కోరిక తీరుస్తామని చెప్పి అక్కడి నుంచి వెళ్లారు. రాముడు, లక్ష్మణుడు లంకకు పోయి రావణా సురున్ని వధించి సీతతో తిరుగు ప్రయాణంలో రాముడు తిరిగి వస్తున్న విషయం తెలుసుకున్న వాయుదేవుడు గండి ప్రాంతంలో రెండు కొండల మధ్య మకర తోరణం కట్టి శ్రీరామచంద్రున్ని ఆహ్వానించారు. ఆ మకరతోరణం నేటికీ పుణ్యాత్ములకు దర్శనమిస్తుందని, జిల్లా గెజిట్‌లో రాయబడి ఉంది. అంతేకాకుండా ఇక్కడ అంజన్నకు సేవ చేస్తున్న పూజారికి కూడా మకరతోరణం కనిపించినట్లు డైరీలో రాసిపెట్టుకున్నట్లు పెద్దలు చెబుతున్నారు. సీతారామలక్ష్మణులు గండిలో ఒక రాత్రి బస చేసిన సమయంలో సీతమ్మజాడ కనిపెట్టి శ్రీరామునికి సహకరించిన ఆంజనేయులవారి జ్ఞాపకంగా ఓ చిత్రాన్ని గీయాలని సీతమ్మ శ్రీరాముల వారిని కోరింది. సీత కోరిక మేరకు శ్రీరాముడు గండి వద్ద కొండకు తన బాణపు ములికితో ఆంజనేయస్వామి చిత్రాన్ని చెక్కారు. తెల్లవారున జామున శుభఘడియలు దాటడంతో ఆంజనేయస్వామి చిటికిన వేలు చెక్కలేక పోయారు. భిన్నంగా స్వామికి పూజలు చేయ కూడదని వేలును చెక్కించడానికి శిల్పిని పిలిపించి చెక్కించబోగా ఆ వేలు నుంచి రక్తం కారింది. అందుకే ఆంజనేయస్వామి స్వామి చిరంజీవి అని ఆంజనేయస్వామి ఎక్కడ చూసిన కొలువై ఉంటాడని ప్రజల నమ్మకం.

ఖాజీపేటలో రెండు బైకులు చోరీ



బైకును తీసుకెళుతున్న దొంగ

ఖాజీపేట, ఆగస్టు 8: పరిధిలో ఏదో ఒక చోట దొంగలు దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఒకే నెలలో ఆరు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. ఏటీఎంలో దొంగతనానికి పాల్పడ్డారు. ఇలా చెప్పుకుంటూ పోతే మరెన్నో. గురువారం తెల్లవారుజామున కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పెట్రోలు బంకులో, కుమ్మరకొట్టాలులో దొంగలు పడ్డారు. రెండు చోట్ల స్కూటర్లను చోరీ జరిగినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి డ్యూటీ చేసి మంచం పక్కనే స్కూటర్ పెట్టుకుని నిద్రిస్తుండగా స్కూటర్‌ను తీసుకెళ్లారు. స్కూటర్ పోయిందని సీసీ ఫుటేజీ చూడగా అందులో వ్యక్తి తీసుకెళుతున్నట్లు ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమ్మరకొట్టాలులో ఇంటిముందున్న బైకును తీసుకెళ్లారు.

జిల్లాలో 63 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

కడప(క్రైం)ఆగస్టు8: ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న 63 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈమేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్పీ సిబ్బంది....

జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిలో 34 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే వారికి కేటాయించిన పోలీసుస్టేషన్ పరిధిలో విధుల్లో చేరాలని ఆదేశించారు.

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
అమర్‌నాథ్ రెడ్డి	ఎస్‌ఏ కాశినాయన	కడప వన్‌టౌన్
మధుసూదన్ రెడ్డి	కడప వన్‌టౌన్	పెండ్లిమర్రి
ప్రదీప్‌నాయుడు	దిశ కడప	కడప తాలుకా
తాహీర్ హుస్సేన్	డీఎస్బీ కడప	కడప తాలుకా
మల్లికార్జున	కడప తాలుకా	వీఆర్ కడప
రాజరాజేశ్వర్ రెడ్డి	డీఎస్బీ కడప	కడప చిన్నచౌక్
రఫీ	చిన్నచౌకు కడప	ప్రొద్దుటూరు రూరల్
శివ ప్రసాద్	ప్రొద్దుటూరు రూరల్	ఒంటిమిట్ట
మధుసూదన్‌రావు	ఒంటిమిట్ట	లింగాల
క్రిష్ణయ్య	లింగాల	చక్రాయపేట
వినోద్‌కుమార్	చక్రాయపేట	దువ్వూరు
శ్రీనివాసులు	దువ్వూరు	ప్రొద్దుటూరు వన్‌టౌన్
మంజునాథ్	ప్రొద్దుటూరు వన్‌టౌన్	వీఎన్ పల్లి
సుభాష్ చంద్రబోస్	పెనగలూరు	రిమ్స్ కడప
హుస్సేన్	టి.సుండుపల్లి	కడప టు టౌన్
సిద్దయ్య	వీఆర్ కడప	కడప టు టౌన్
సంజీవ్ రాయుడు	కడప టు టౌన్	వల్లూరు
చిరంజీవి	ఎర్రగుంట్ల	సిద్దవటం
జయగోపాల్	వీఆర్ కడప	పీసీఆర్ కడప
అనిల్ కుమార్	సింహాద్రిపురం	పులివెందుల
తిరుపాల్ నాయక్	కడప తాలుకా	వేంపల్లి
తులసీ నాగ ప్రసాద్	రాజుపాళెం	సింహాద్రిపురం
పెద్దఓబన్న	సిద్దవటం	తొండూరు
లక్ష్మీనారాయణ	తొండూరు	వీఆర్ కడప
ప్రవీణ్ కుమార్	వేంపల్లి	వేముల

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
హైమవతి	ప్రొద్దుటూరు వన్‌టౌన్	వీఆర్ కడప
ధనుంజయుడు	వేముల	ప్రొద్దుటూరు టు టౌన్
రామక్రిష్ణ	ప్రొద్దుటూరు టు టౌన్	అట్లూరు
చప్పలరాజు	అట్లూరు	బి.కోడూరు
జయరాములు	బి.కోడూరు	రిమ్స్ కడప
నారాయణ	రిమ్స్ కడప	పులివెందుల
విష్ణు నారాయణ	పులివెందుల	ఎర్రగుంట్ల
భాస్కర్ రెడ్డి	ఎర్రగుంట్ల	ఆర్కే వ్యాలీ
రంగరావు	ఆర్కే వ్యాలీ	వేంపల్లి
వెంకటరమణ	వల్లూరు	రాజుపాళెం
యోగేంద్ర	కొండాపురం	ప్రొద్దుటూరు త్రీ టౌన్
జ్యోతి	ప్రొద్దుటూరు త్రీ టౌన్	సీసీఎస్ కడప
భాస్కర్	వీఆర్ కడప	ప్రొద్దుటూరు ట్రాఫిక్
సుబ్బారావు	వీఆర్ కడప	మైదుకూరు

ఎస్‌ఐ పేరు	ప్రస్తుతం స్టేషన్	బదిలీ అయిన స్టేషన్
రవికుమార్	బద్వేలు రూరల్	బద్వేలు
చిన్న పెద్దయ్య	ఓబుళవారి పల్లి	చాపాడు
చంద్రశేఖర్	టి.సుండుపల్లి	బి.మఠం
కొండారెడ్డి	చాపాడు	పోరుమామిళ్ల
చిరంజీవి	ప్రొద్దుటూరు రూరల్	కలసపాడు
హనుమంతు	తలమంచిపట్నం	ఎస్‌ఏ కాశినాయన
నాగమురళి	కలసపాడు	ఎర్రగుంట్ల
రామక్రిష్ణ	పెద్దముడియం	జమ్మలమడుగు
సుబ్బారావు	జమ్మలమడుగు	పెద్దముడియం
విద్యాసాగర్	బి. మఠం	కొండాపురం
తిమ్మోతి	వీఆర్ కడప	కలమల్ల
ప్రతాప్ రెడ్డి	చౌడేపల్లి (చిత్తూరు)	కమలాపురం
హృషీకేశ్వర్ రెడి	కమలాపురం	తాళ్ల ప్రొద్దుటూరు
బాల అంకయ్య	వీఆర్ కడప	డిఎస్‌బి కడప
మురళి మోహన్	వీఆర్ కడప	డిఎస్‌బి కడప
అరుణ్ రెడ్డి	వీఆర్ కడప	డిఎస్‌బి కడప
శ్రీనివాసులు	వీఆర్ కడప	దిశ కడప
ఎఎస్‌ఎన్‌కుమార్	వీఆర్ కడప	డిసిఆర్‌బి కడప
సంజీవరెడ్డి	వీఆర్ కడప	డిసిఆర్‌బి కడప
మరియన్న	వీఆర్ కడప	డిటిసి కడప
ప్రతాప్‌రెడ్డి	వీఆర్ కడప	కడప ట్రాఫిక్
సుబ్రమణ్యం	వీఆర్ కడప	కడప ట్రాఫిక్
అనసూయ	వీఆర్ కడప	దిశ కడప
రాఘవేంద్రారెడ్డి	ఇటుకల పల్లి (అనంతపురం)	ప్రొద్దుటూరు టు టౌన్

మైదుకూరు డీఎస్పీగా రాజేంద్రప్రసాద్



కడప (క్రైం), ఆగస్టు 8: మైదుకూరు డీఎస్పీగా కడప ఇంటెలిజెన్స్ డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. 1995బ్యాచ్‌కు చెందిన ఈయన వైఎస్ఆర్ జిల్లాలోనే ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. 2008లో సీఐగా, 2023 డిసెంబరు 23న డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం కడప ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తూ మైదుకూరు డీఎస్పీగా బదిలీ అయ్యారు.

సమర్థుడైన ఎస్‌ఐని నియమించాలి

- ఎస్పీకి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి లేఖ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8: పులివెందులలో సమర్థవంతమైన ఎస్ఐని నియమించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ఎస్పీని లేఖలో కోరారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌ఐల బదిలీల్లో భాగంగా సింహాద్రిపురం ఎస్ఐగా ఉన్న అనిల్‌కుమార్‌ను పులివెందుల స్టేషన్‌కు బదిలీ చేశారన్నారు. ఇతను ఎన్నికల ముందు సింహాద్రిపురం ఎస్ఐగా వచ్చి ఎన్నికల ప్రచారంలో 'సైకో పోవాలి, సైకిలు రావాలి' పాటను మండలంలో ఎక్కడా పెట్టకుండా అడ్డుకున్న విషయం గుర్తు చేశారు. కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తూ బెదిరించారన్నారు. సాక్షాత్తు తనపైన తన కుటుంబ సభ్యులపైన దురుసుగా ప్రవర్తించి అవమానించాడని ఆరోపించారు. తమ గ్రామంలో ఓటర్లను కూడా టీడీపీకి ఓటు వేయవద్దని బహిరంగానే బెదిరించినట్లు ఆరోపించారు. ఇతని మీద తాను గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. అనిల్‌కుమార్‌రెడ్డి గతంలో పులివెందుల ఎస్ఐగా పనిచేశారని, అప్పుడు అతని అవినీతి అక్రమాలకు పాల్పడడంతో ఆ సమయంలో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించి చర్యలు తీసుకున్నారన్నారు. అర్హత లేకున్నా తన కుటుంబసభ్యుల పేరుపై తప్పుడు పత్రాలు సమర్పించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇన్నోవా కారు తీసుకున్నాడన్నారు. దీనిపై కూడా ఇతనిపై దర్యాప్తు చేశారని తెలిపారు. పులివెందుల వైసీపీ నేతలకు ఇతనికి అత్యంత సన్నిహిత వ్యాపార సంబంధాలున్నాయన్నారు. శాంతిభద్రతలు పరిరక్షించకుండా మట్కా, జూదాన్ని ప్రోత్సహించాడని ఇతని బదిలీని నిలిపివేసి సమర్థవంతమైన అధికారిని ఎస్ఐగా నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ఓపెన్ స్కూల్స్ ద్వారా నమోదు శాతం పెంచండి

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్




ఓపెన్ స్కూల్ కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు

రాయచోటిటౌన్, ఆగస్టు8: టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయిన, చదువును మధ్యలో మానేసిన విద్యార్థులు, కార్మికులు వివిధ సంఘాల సభ్యుల సౌకర్యార్థం ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా కల్పించిన ఓపెన్ స్కూల్స్‌లో నమోదు శాతాన్ని పెంచాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీధర్, ఓపెన్ స్కూల్స్ అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజుతో కలిసి ఓపెన్ స్కూల్ పరీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. అన్నమయ్య జిల్లాలో అక్షరాస్యతను పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. వివిధ కారణాల చేత బడి మానేసి, టెన్త్ ఫెయిల్ అయి 14 ఏళ్లు నిండిన వారు టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయి 15 ఏళ్లు నిండిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్ చదివే అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్, ఇతర అధికారులు, విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించి, అన్నమయ్య జిల్లాను అక్షరాస్యత జిల్లాగా తయారు చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పాఠశాలల్లో ఇంటర్, టెన్త్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ పిలుపునిచ్చారు. గురువారం డీఈఓ కార్యాలయంలోని తన చాంబరులో అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచర్‌ను ఆమె విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 27లోగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు. డీఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న మైనార్టీ నేతలు, శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 8: వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకించి సెలక్ట్ కమిటీకి పంపాలని టీడీపీ ముస్లిం మైనార్టీ సంఘాలతో కలిసి పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వారు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉలేమా కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు ముక్తిఫరూక్, ఎంహెచ్ ఉలే మా ఎ హింద్ రాష్ట్ర కన్వీనరు మౌలా నా హుసేన్ అహ్మద్, మైనార్టీ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటరు అబ్దుల్ గఫూర్, వక్ఫ్‌బోర్డు సీఈఓ అబ్దుల్‌ఖాదర్, టీడీ జనార్థన్, పాల్గొన్నారు.

నవోదయ క్లస్టర్ గేమ్స్ చాంపియన్‌గా చిత్తూరు

మదనపల్లె టౌన్, ఆగస్టు 8: జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్‌వీ)లో నిర్వహించిన క్లస్టర్ గేమ్స్‌లో చిత్తూరు నవోదయ విద్యాలయ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. వలసపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజులుగా నిర్వహించిన క్లస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో అనంతపురం, చిత్తూరు, కడప, కరైకల్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం-1, ప్రకాశం-2, పుదుచ్చేరి జిల్లాలకు చెందిన 9 విద్యాలయల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. గురువారం హర్డిల్స్, రిలే పరుగుపందెం, ఐదు కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ, 5 కిలోమీటర్ల నడక పందేలు నిర్వహించగా చిత్తూరు జిల్లా జట్టు(మదనపల్లె నవోదయ విద్యాలయ) మొత్తం 451 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. 84 పాయింట్లతో నెల్లూరు జేఎన్‌వీ ద్వితీయ స్థానం, 67 పాయింట్లతో తృతీయ స్థానంలో కడప జేఎన్‌వీ నిలిచింది. 12వ తేదీన మదనపల్లె జేఎన్‌వీలో నిర్వహించే హైదరాబాద్ రీజనల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ) స్థాయి క్రీడా పోటీల్లో చిత్తూరు క్లస్టర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

మూడేళ్లు జైలు - జరిమానా

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 8: అమ్మాయిని వేధించిన కేసులో నిందితుడు పొట్టిపాటి శ్యామ్‌కు మూడేళ్ల జైలుశిక్ష, రూ. 8 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. 2019లో ఓ అవివాహితను అదే వీధికి చెందిన పొట్టిపాటి శ్యామ్ ప్రేమించమని వెంటపడి వేధిస్తున్నాడు. ఈ క్రమంలో అమె ఫిర్యాదుపై అప్పటి ఎస్ఐ నారాయణ యాదవ్ కేసు రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో శిక్ష పడేలా చేసిన ఎపీపీ స్వప్నను అభినందిస్తూ, కోర్టు కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్, సుధాకర్‌ను ఎస్పీ హర్షవర్ధన్ అభినందించినట్లు తెలిపారు.

షాపులో చోరీ చేసిన మహిళలు

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 8: బట్టలు కొనేందుకు బట్టల షాపునకు వచ్చిన కొందరు మహిళలు చీరలు అపహరించుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. శ్రీరామ్‌నగర్‌లో చోటు చేసుకున్న ఘటన విషయానికి వస్తే... రెండు రోజుల కిందట కొందరు మహిళలు కారులో దుకాణానికి వెళ్లారు. అక్కడ కొన్ని చీరలను చూస్తూ కొద్దిసేపటి తర్వాత షాపు సిబ్బందిని మాటల్లో పెట్టి సుమారు లక్ష రూపాయల విలువైన చీరలను అపహరించుకెళ్లారు. అనుమానం వచ్చిన యజమాని సీసీ కెమెరాలను పరిశీలించగా మహిళలు చోరీ చేసినట్లు వారు గుర్తించారు. ఈ క్రమంలో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

50 మందిపై కేసులు

రూ.3లక్షలు జరిమానా

కడప (నాగరాజుపేట), ఆగస్టు 8: పులివెందుల, కడప రూరల్ ప్రాంతాల్లో గురువారం ఏకకాలంలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు దాడులు జరిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న పలు ఇళ్ల, దుకాణాలపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. కడప విజిలెన్స్ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో తనిఖీ చేపట్టి అక్రమంగా విద్యుత్‌వినియోగిస్తున్న 40 మందిని విజిలెన్స్ అధికారులు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా విద్యుత్ చౌర్యం చేసే వారికి రూ.2లక్షలు జరిమానా విధించారు. విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, చౌర్యానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఈ మధులత, ఏఈలు రామాంజనేయరెడ్డి, మస్తాన్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

విచారణ అధికారులతో సమస్య ఏకరువు



విచారణాధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

బి.కోడూరు, ఆగస్టు 8: 'జిల్లా పరిషత్ హైస్కూలు తనఖా' శీర్షికపై విచారణాధికారులకు గ్రామస్తులు సమస్యను ఏకరువుపెట్టారు. మండలంలో ఇటీవల సంచలనం రేపిన 'జిల్లా పరిషత్ హైస్కూలు తనఖా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వెలువడిన కథనంపై స్పందించిన కలెక్టరు శివశంకర్ లోతేటి డిప్యూటీ తహసీల్దారు విద్యాసాగర్, వీఆర్వో గురప్ప, సచివాలయ సర్వేయరు ప్రవీణ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దీనిపై సచివాలయ సర్వేయరు ప్రవీణ్ తన తప్పులేదంటూ కలెక్టరుకు విన్నవించుకోవడంతో విచారణ నిమిత్తం కలెక్టర్ జిల్లా అసిస్టెంటు సర్వేయరు మురళీక్రిష్ణను పంపించారు. గోవిందాయపల్లె జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించేందుకు వచ్చిన అధికారికి గ్రామస్తులు ఏకమై మూకుమ్మడిగా ఏకరువు పెట్టారు. తప్పుడు పత్రాలకు సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలను ఆన్‌లైన్ చేయించుకుని వివిధ బ్యాంకుల్లో రుణాలు తెచ్చుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేయాలని అధికారులను కోరారు. స్పందించిన అధికారి నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తదుపరి నిర్ణయం వారిదేనని వారు గ్రామస్తులకు తెలిపారు. వీరి వెంట డిప్యూటీ సర్వేయరు వెంకటేశ్, మండల సర్వేయరు భాస్కర్, సర్వేయర్లు పాల్గొన్నారు.

కేసు నమోదు...

గోవిందాయపల్లె 'జిల్లా పరిషత్ హైస్కూలు తనఖా' శీర్షికతో జిల్లా అధికారులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మున్నెల్లి గ్రామ పొలం సర్వే నెం.755లో 4 ఎకరాల 27సెంట్లు కొండా వెంకటసుబ్బమ్మ పేరుతో ఆన్‌లైన్ నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకుంటూ ముగ్గురు అధికారులను సస్పెండ్ చేశారు. మున్నెల్లి గ్రామ సర్వే నెం.755లో 4 ఎకరాల 27 సెంట్లు జిల్లా పరిషత్ హైస్కూలు స్థలమని, దానిని తప్పుడు డాక్యుమెంటు చూపి ఆన్‌లైన్ చేయించుకుని సహకార సొసైటీ బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.8 లక్షలు రుణం తీసుకున్న కొండా వెంకటసుబ్బారెడ్డి అతని భార్య కొండా వెంకటసుబ్బమ్మపై కేసు నమోదు చేయాలని కోరారు. బ్యాంకు రుణాన్ని అదే బ్యాంకు సూపర్‌వైజరు నారాయణరెడ్డి చెల్లించారని, వారిని సుండుపల్లెకు బదిలీ చేస్తూ కల్కెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఈబీ సిబ్బందిపై ట్రాక్టర్ల యజమానుల దాడి - కేసు నమోదు

జమ్మలమడుగు, ఆగస్టు 8: దిగువపట్నం కాలనీ శివార్లలో పెన్నానది వద్ద ఇసుకను ట్రాక్టర్లకు లోడు చేస్తున్నారని రాబడిన సమాచారం మేరకు గురువారం రాత్రి ఎస్ఈబీ సీఐ లత, సిబ్బంది వెళ్లినట్లు ఆమె తెలిపారు. దిగువపట్నం కాలనీ, పొన్నతోట పంచాయతీ మధ్య పెన్నానదిలో ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండాపోయిందని, పగలు, రాత్రి ఇసుక యజమానులు బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారని బహిరంగ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఇసుక విషయంలోనే గొడవలు జరిగి పలువురు గాయపడిన విషయం తెలిసిందే. అందులో భాగంగా సాయంత్రం రాబడిన సమాచారం మేరకు ఎస్ఈబీ సీఐ లత వారి సిబ్బంది దిగువపట్నం కాలనీ పెన్నానది వద్దకు వెళ్లారు. అక్కడ ట్రాక్టర్‌కు లోడు చేసి ఇసుకను తరలిస్తుండగా సీఐ, సిబ్బంది అడ్డుకున్నారు. అదే సమయంలో అక్కడున్న కె.క్రిష్ణమూర్తి అతని అనుచరులు మొత్తం 6 నుంచి 8 మంది ఎస్ఈబీ సీఐ లత, వారి సిబ్బందిపై దాడి చేసినట్లు ఆమె తెలిపారు. ఇందుకు సంబంధించి వెంటనే అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ లత, వారి సిబ్బంది ముగ్గురు కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రాజకీయంగా ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా జమ్మలమడుగులో అడ్డు అదుపు లేని అక్రమ ఇసుక రవాణాపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఇలా ఉంటే పోలీసులు అధికారులు విధులు నిర్వహించాలన్నా ఇబ్బందికరంగా మారుతోందని స్టేషన్ ఎదుట ఎస్ఈబీ సిబ్బంది వాపోయారు.


రాయచోటి: మార్కెట్ ఉర్దూ పాఠశాలలో ఎన్నికలను పర్యవేక్షిస్తున్న ఎంఈవో బాలాజీనాయక్


గరుగుపల్లె హైస్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చెర్మన్‌లను సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు


రాజంపేట: ప్రమాణస్వీకారం చేస్తున్న ఉర్దూ ఉన్నత పాఠశాల కమిటీ ప్రతినిధులు


కొండ్రెడ్డిగారిపల్లె హైస్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ అభినందిస్తున్న కమిటీ సభ్యులు

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

రాయచోటిటౌన్ ఆగస్టు8: రాయచోటి మండలంలో మొత్తం 106 పాఠశాలలకు గాను 93 పాఠశాలల స్కూల్ కమిటీలు ఏకగ్రీవం కాగా 13 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. రాయచోటి అర్బన్ పరిధిలో 42 పాఠశాలలు ఉండగా అందులో 36 పాఠశాలల కమిటీలు ఏకగ్రీవం కాగా మార్కెట్ ఉర్దూ, అలీమాబాద్ ఉర్దూ, డైట్ హైస్కూల్, డైట్ ప్రైమరీ స్కూల్, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల, ఎగువ అబ్బవరం పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. రూరల్ పరిధిలో 64 పాఠశాలలు ఉండగా 57 కమిటీలు ఏకగ్రీవం కాగా 7 పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. అందులో ఆంధ్రప్రదేశ్ గిరిజన రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్, ఏపిలవంకపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాల, చెర్లోపల్లి పాఠశాల, బోయపల్లె పాఠశాల ఉన్నాయి. ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి బాలాజీ నాయక్ పట్టణంలో ఎన్నికలను పర్యవేక్షించారు. 13 పాఠశాలలో చాలా వరకు టీడీపీ వర్గీయుల మధ్య పోటీ నెలకొనగా, కొన్నిచోట్ల టీడీపీ- వైసీపీ వర్గాల మధ్య పోటీ నెలకొంది. మండల పరిధిలోని గరుగుపల్లె హైస్కూల్ కమిటీ ఎన్నికల్లో చైర్మన్‌గా పల్లపు అంజనేయులు, వైస్ చైర్మన్‌గా పల్లపు భారతిని, ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్‌గా పల్లపు లోకేశ్, వైస్ చైర్మన్‌గా ఓర్సు లక్ష్మీకుమారిని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు ప్రధానోపాధ్యాయుడు నియామక పత్రాలను అందజేశారు

సంబేపల్లె: మండలంలో 62 ప్రాథమిక పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలతో కలిపి పది చోట్ల పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ఏకగ్రీవంగా జరిగాయన్నారు. 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఒక్కొక్క తరగతికి ముగ్గురు సభ్యులు చొప్పున మొత్తం 24 మందిని యాజమాన్య కమిటీ సభ్యులుగా సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు ఎంపిక చేసుకున్నారు. సంబేపల్లె ఉన్నత పాఠశాల ఛైరపర్సన్‌గా రెడ్డిరాణిని, వైస్ ఛైర్మన్‌గా పఠాన్ బాబ్జిని, మోడల్ స్కూల్ ఛైర్మన్ రెడ్డిమోహన్, వైస్ ఛైర్మన్ లక్ష్మీదేవి, పెద్దజంగంపల్లి ఉన్నత పాఠశాల ఛైర్మన్ వీరేంద్ర, వైస్ ఛైర్మన్ స్వాతి, ప్రాథమిక పాఠశాల ఛైర్మన్ దేవేంద్ర, వైస్ ఛైర్మన్ మౌనికను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానికంగా అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఏకగ్రీవాలు జరిగాయి. అనంతరం పాఠశాల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామని, నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, పెద్దజంగంపల్లి ప్రధానోపాధ్యాయుడు చక్రపాణి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : మండలంలో 69 పాఠశాలలతో పాటు, కస్తూరిబా గాంధీ, బాలికల విద్యాలయం, అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఏపీ మోడల్ చైర్మన్ గా యనమల మణి వైఎస్ చైర్మన్‌గా చలపతి, జాండ్రపల్లె హైస్కూల్‌కు భువనేశ్వరయ్య, దేవళంపల్లె హైస్కూల్‌కు వీరాంజనేయులు, దిన్నెపాడు పర్వతరెడ్డిగారి ఎల్లె హైస్కూల్‌కు వెంకటరమణ, లక్కిరెడ్డిపల్లె బాలుర పాఠశాలకు విజయమోహన్ , బాలికల హైస్కూల్‌కు గంగాదేవి ,అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు శివమ్మ, కేజీబీవీకి చెల్లు రమణమ్మ, తదితరులు ఎన్నికయ్యారని ఎంఈఓలు చక్రీనాయక్, వెంకటసుబ్బయ్య తెలిపారు. దియ్యలవాండ్లపల్లె, ప్రాథమిక పాఠశాల పెండింగ్‌లో ఉన్నట్లు వారు తెలిపారు.

రాజంపేట: ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎ.చెంగల్‌రాజు, వైస్‌చైర్మన్‌గా కృష్ణవేణి ఎన్నికయ్యారు. మన్నూరు ఉన్నత పాఠశాల చైర్మన్‌గా అనుమలగుండం నాగరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా పిడుగు సుమతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజంపేట పట్టణ బాలికల ఉన్నత పాఠశాల కమిటీ చైర్‌పర్సన్‌గా చావిడి లత, వైస్ చైర్మన్‌గా కె.గిరీష్, పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా షేక్ అబ్దుల్ వహాద్, వైస్‌చైర్మన్‌గా షేక్ రకీబున్నీషా, కోఆప్షన్ సభ్యులుగా గుల్జార్‌బాషా, షేక్ అబ్దుల్లా ఎన్నికయ్యారు.

గాలివీడు: మండలంలో 69 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలుండగా అన్ని పాఠశాలల్లో కమిటీ సభ్యులతో పాటు, చైర్మన్, వైస్‌చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల విద్యాధికారులు, పోలీసులు ఎన్నికల సరళిని పర్యవేక్షించారు.

సిద్దవటం : మండలంలోని 49 పాఠశాలలు ఉండగా 41 కమిటీలు ఏకగ్రీవం కాగా , 8 చోట్ల ఓటింగ్ నిర్వహించారు. మోదిన్ సాహెబ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో చింతోటి పిచ్చయ్య స్కూల్ కమిటీ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా మందారపు సునీతను ఎన్నిక కాగా, ఉపాధ్యాయురాలు మహాలక్షుమ్మ నియామకపత్రాన్ని అందజేశారు. సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రైల్వేకోడూరు: మండలంలో స్కూలు కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రైల్వేకోడూరు సీఐ టి. బాబు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కమిటీ ఎన్నికలు జరిగే స్కూళ్ల వద్ద పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు. కమిటీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, సభ్యులను ఎంపిక ఏకగ్రీవంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారి పోతురాజు రామయ్య తెలిపారు.

చిన్నమండెం: మండలంలోని 60 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈవో శివనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు పోటీ లేకుండా ఏకగ్రీవంగా కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎన్నుకున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండల వ్యాప్తంగా ఉన్న 49 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీల ఎన్నికలు ఏక్రగీవమయ్యాయి. ఒంటిమిట్ట జడ్పీ పాఠశాల చైర్మన్, వైస్‌చైర్మన్లుగా షేక్ షఫీ, ఆదిలక్ష్మీ, రాజుపల్లె జడ్పీ హైస్కూల్‌కు రాజశేఖర్‌రాజు, సునీత, కొత్తమాధవరం హైస్కూల్ కు తులసీ రామ్, నాగలక్ష్మి, మంటపంపల్లెలో షరీఫ్, చెంచమ్మ, చింతరాజుపల్లెలో నరసింహులు, దేవి, ఉర్దూ పాఠశాలలో కమాల్‌బాషా, ఇలియాస్ ఎన్నికయ్యారు. సీఐ మోహన్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దారు రమణమ్మ, ఎంఈవో వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు. కాగా, గంగపేరూరు, ఇబ్రహీంపేట, రాచగుడిపల్లె, పెద్దకొత్తపల్లె ప్రాథమిక పాఠశాలల్లో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

పెనగలూరు: కట్టావారిపల్లె పంచాయతీలోని మల్లాలమ్మ ఎస్టీ కాలనీ పాఠశాలలో ఒకే వర్గానికి చెందిన వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్.కమ్మపల్లెకు చెందిన ఓ ప్రజాప్రతినిధి, అప్పారాజుపేటకు చెందిన ఓ నాయకుడు గందరగోళం సృష్టించారు. చివరకు అధికారులు, పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్ది ఎన్నిక ఏకగ్రీవమయ్యేలా చూశారు. ఆదర్శ పాఠశాలలో వాదోపవాదాల నడుమ ఎన్నిక ముగిసింది. సింగారెడ్డిపల్లె పంచాయతీలో మాజీ సర్పంచ్ మారంరెడ్డి లక్ష్మీనరసయ్య, మాజీ మండల టీడీపీ కార్యదర్శి ఎం.శివ అధ్యక్షతన ఆదర్శ పాఠశాల, కేజీబీవీ కంబాలకుంట యూపీ పాఠశాల, సింగారెడ్డిపల్లె గడ్డమీద హరిజనవాడ పాఠశాలల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వీరబల్లి: మండలంలోని 75 ప్రాథమిక, ఉన్నత, కేజీబీవీల్లో విద్యా కమిటీ ఎన్నికలు జరిగాయి. ఉప్పరపల్లిలో నాయునివారిపల్లెకు చెందిన వాణిని చైర్‌పర్సన్‌గా, గంగనేరుకు చెందిన కే. రాజా వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేజీబీవీలో జగిలి ప్రసన్న, వెంకట్రమణ, వీరబల్లి జెడ్పీ పాఠశాలలో రాయ రమణయ్యనాయుడు, లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.. మట్లి, పెద్దివీడు, సానిపాయి, గడికోట, తాటిగుంటపల్లి, ఓదివీడు, సోమవరం, వంగిమళ్ల గ్రామాల్లోని పాఠశాలల్లో ఈ విద్యా కమిటీ ఎన్నిక జరిగింది.

చిట్వేలి: మండలంలో 58 ప్రాథమిక పాఠశాలలు, 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 1 కేజీబీవీ పాఠశాలల్లో స్కూల్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి కోదండనాయుడు తెలియజేశారు. చిట్వేలి హైస్కూల్ చైర్మన్‌గా పాండురాజు శివశంకర్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

రామాపురంలో రెండు పాఠశాలలు పెండింగ్

రామాపురం: తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే పాఠశాలలు అభివృద్ధి జరుగుతుందని ఎంఈవో-2 జయచంద్ర అన్నారు. గురువారం మండల వ్యాప్తంగా జరిగిన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మండల వ్యాప్తంగా 59 పాఠశాలలు ఉండగా అందులో రెండు మాత్రం పెండింగ్ పడ్డాయి. మిగిలిన 45 ప్రాథమిక పాఠశాలలు, 4 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గురుకుల పాఠశాల, డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు వివరించారు


లక్కిరెడ్డిపల్లె: ఎస్ఎంసీ ఎన్నికల సందర్భంగా మోడల్ స్కూల్ వద్ద పోలీసు బందోబస్తు


కోడూరు క్యాంపస్ స్కూలు చైర్మన్‌గా కుమారస్వామిని ప్రకటిస్తున్న ఎంఈవో రామయ్య


రాచపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంపికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లు


వీరబల్లి: సన్మానం అందుకుంటున్న కస్తూరిబా పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్


చిట్వేలి జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్‌కమిటీ చైర్మన్ శంకర్‌రాజును సత్కరిస్తున్న నేతలు

ఎస్ఎంసీ ఎన్నికల్లో వైసీపీ అత్యుత్సాహం

సుండుపల్లె, ఆగస్టు 8: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు వైసీపీ నాయకులు రాజకీయ రంగుదిద్దారు. తమ మద్దతుదారులనే ఎన్నుకునేందుకు చేసిన ప్రయత్నాలను తల్లిదండ్రులు అడ్డుకున్నారు. మండలంలోని పింఛా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల్లో పాల్గొనేందుకు వచ్చిన తల్లిదండ్రులను వాపసు పంపిం చేందుకు వైసీపీ మద్దతు దారులు ప్రయత్నాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి నేతలు అక్కడికి చేరుకుని ఎన్నిక లు నిర్వహించాలని పట్టుబ ట్టారు. ఇంతలో మండల వైసీపీ అధ్యక్షుడు రామస్వామి రెడ్డి కొం తమంది అనుచరులతో కలిసి వీరంగం సృష్టించారు. తాము చెప్పి న వారినే కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌గా గెలిపించాలని పట్టు బట్టారు. యాజమాన్య కమిటీ సభ్యు ల పేర్లు రాస్తున్న ఓ ఉపాధ్యాయుడిని బెదిరించి నువ్వు ఎలా రా స్తావో రాయి నేను కేసు పెడతానని భయ భ్రాంతులకు గురి చేశారు. పెద్ద సం ఖ్యలో వైసీపీ నాయకులు, టీడీపీ నాయకులు అక్కడికి చేరుకోవడంతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఇంటికి పంపించేశారు. అనం తరం ఎంఈవో రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్‌కేఎం హుస్సేన్, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో చైర్మెన్, వైస్ చైర్మన్‌తో పాటు యాజమాన్య కమిటీ ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం నూతన యాజమాన్య కమిటీ పూర్తి కావడంతో టీడీపీ నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను సన్మానించి ప్రభుత్వ బడుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.


విద్యార్థి తల్లిదండ్రులను బెదిరిస్తున్న వైసీపీ నేత

మాదకద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులు బాధ్యత వహించాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 8: మాదకద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులు బాధ్యత వహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం. భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రైల్వేకోడూరు మండలం కె.బుడుగుంటపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, నిర్మూలన అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది యం. శంకరయ్య మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగిస్తే విధించే శిక్షలను వివరించారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి. దయానందం, పొలిటికల్ సైన్సు అధ్యాపకులు డాక్టర్ జి. శ్రీనివాసులు, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎస్. సుబ్రహ్మణ్యంరాజు, చరిత్ర అధ్యాపకులు డి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమం లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి

ఎస్పీని కలిసిన రాజంపేట సబ్‌కలెక్టర్

రాయచోటిటౌన్, ఆగస్టు8: రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమ్ నిదియాదేవి గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజంపేట సబ్ డివిజన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ సమస్యలపై చర్చించారు.


ఎస్పీని కలిసిన రాజంపేట సబ్ కలెక్టర్

దివ్యాంగ విద్యార్థులకు తిథి భోజనం

రాయచోటిటౌన్, ఆగస్టు 8: భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో తిథి భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమెరికా వాస్తవ్యుడు లోకనాథరెడ్డి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ ప్రజా సేవ లక్ష్యంతోనే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ అధ్యక్షుడు శివారెడ్డి, జోన్ చైర్మన్ షేక్ మహమ్మద్, కార్యదర్శి షేక్ ఇందాద్ అహమ్మద్, పవన్‌కుమార్‌నాయుడు, నందిని ట్రావెల్స్ వినోద్‌కుమార్‌నాయక్, భవిత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగ విద్యార్థులకు అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ సభ్యులు

బుద్ధదేవ్ భట్టాచార్య మృతి తీరని లోటు

రాయచోటిటౌన్, ఆగస్టు8: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. బుద్ధదేవ్ మరణం పార్టీకి, ప్రజా ఉద్యమాలకు లోటన్నారు. దేశాన్ని సోషలిజం వైపు నడిపేందుకు చేసే పోరాటమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

తల్లిపాలు పిల్లలకు తప్పనిసరి

చిన్నమండెం, ఆగస్టు 8: తల్లిపాలు పిల్లలకు శ్రేయస్కరమని పుట్టినరోజు నుండి ఆరు మాసాల వరకు ప్రతి బిడ్డకు తల్లిపాలు పట్టించాలని అంగన్వాడీ టీచర్ శైలజ తెలిపారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ పట్టంవాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలని తర్వాత ఇతర పౌష్టికాహారాలు అందించాలని తద్వారా పిల్లల ఎదుగుదల, జ్ఞాపకశక్తి పెరుగుదలకు తోడ్పడతాయని వివరించారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన లోగో

అన్నమాచార్య వర్శిటీలో 3డీ ప్రింటింగ్‌పై గెస్ట్ లెక్చర్

రాజంపేట, ఆగస్టు 8 : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో గురువారం 3డీ ప్రింటింగ్‌పై మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. 3డీ ప్రింటింగ్ ప్రాముఖ్యత, ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ కోఆర్డినేటర్ వెంకటేశ్, మెకానిల్ విభాగధిపతి హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా ఉండాలి

వీరబల్లి, ఆగస్టు 8: కల్వర్టు పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు ఆపివేస్తామని ఆర్‌ఆర్‌బీ అధికారులు డీఈ వెంకటసుబ్బయ్య, ఏఈ మహమ్మద్‌యూసుఫ్ హెచ్చరించారు. గురువారం పుల్లగూరగండి సమీపంలోని మాండవ్యనదిపై కల్వర్టు పనుల నాణ్యతను పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు ఉంటేనే కాంట్రాక్టర్లకు బిల్లు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

విగ్రహాల ఊరేగింపు

పెనగలూరు, ఆగస్టు 8 : మండల కేంద్రంలోని పి.కొత్తపల్లెలో కార్యసిద్ధి వినాయకస్వామి ఆలయంలో శుక్ర వారం ప్రతిష్ఠించనున్న విగ్రహాలను గురువారం మధ్యాహ్నం ఊరేగించారు. కార్యసిద్ధి వినాయకుడి మూల విరాట్, మూషిక వాహనం ద్వార పాల కులు జయ విజయులు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల రాతి విగ్రహాలను పి.కొత్తపల్లె, వినాయకనర్ తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానం, సాయంత్రం ఐదు గంటల కు కళ్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం భక్తులకు అల్పాహార ప్రసాద పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు.


ఊరేగుతున్న విగ్రహాలు

దౌర్జన్యంగా జెండా దిమ్మె తొలగింపు



బీజేపీ నేత నిర్మించిన జెండా దిమ్మె, తొలగించిన అనంతరం ఖాళీ ప్రదేశం

ఓబులవారిపల్లె, ఆగస్టు 8: తమ హయాంలో కట్టించిన పాఠశాలలో ఇతర పార్టీలకు చెందిన వారు ఎలాంటి అభివృద్ధి పనులు చేయరాదంటూ బీజేపీ నేత ఏర్పాటు చేసిన జెండా దిమ్మెలను ఓ వైసీపీ తొలగించి వేశాడు. గత సంవత్సరం ఏర్పాటు చేసిన జడ్పీ హైస్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు నిర్వహించుకునేందుకు ఆగస్టు 6న బీజేపీ యువ నాయకుడు చిన్నరెడ్డి గోవర్ధన్‌రెడ్డి 15 వేల రూపాయలు వెచ్చించి జెండా దిమ్మె నిర్మించారు. గత ప్రభుత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన రక్యాసి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ నిర్మాణం జరిగిందనే అహంకారంతో, వారి అండదండలతో ఆగస్టు 7న వైసీపీ కార్యకర్త చన్నరెడ్డి అశోక్‌రెడ్డి రాజకీయ కక్షతో జెండా తొలగించారని గోవర్ధన్ రెడ్డిఆరోపించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు జెండా ఎగురవేసేందుకు ఏర్పాటు చేసిన దిమ్మెను ధ్వంసం చేయడాన్ని సాక్ష్యాధారాలతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్ఐ చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ కార్యకర్త అశోక్‌రెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యక్ష సాక్షులున్నా.. పోలీసులు వీడియో తీసినా.. ప్రస్తుత ఓబులవారిపల్లె ఎస్ఐ చిన్నపెద్దయ్య వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు వ్యవస్థకు సిగ్గుచేటన్నారు. దిమ్మెను ధ్వంసం చేసిన చిన్నరెడ్డి అశోక్‌రెడ్డి ఆయన అనుచరులపై కేసు ఫైల్ చేసి న్యాయస్థానం ముందు హాజరు పరచాలని డిమాండ్ చేశారు.నాయకులకు కొమ్ముకాసే ప్రభుత్వ అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలకు తెలియజేస్తామని బీజేపీ నాయకులు తెలిపారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అలవర్చుకోవాలి

సంబేపల్లె, ఆగస్టు8: రైతులు పంటల సాగులో సేంద్రియ వ్యవసాయ విధానంలో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలని జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. గురువారం దేవపట్ల గ్రామం రెడ్డివారిపల్లెలో ఐసీఆర్పీ శివరాణి సాగు చేసిన వేరుశనగ పైరును పరిశీలించారు. రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి సాధించవచ్చునని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు తెలియజేశారు. వేరుశనగలో కాలర్‌ర్యాట్, బూజు తెగులు రాకుండా సాఫ్ కార్బెండజిం, బావిష్టిన్ రెండు గ్రాములు చొప్పున ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. రసాయనాలకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయ విధానాల ద్వారా పంట సాగు చేస్తే బూములు సారవంతమవుతాయన్నారు. వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శ్రీలత, ప్రకృతి వ్యవసాయం ఏవో ఉమాపతి, ఏఈవోలు రెడ్డి వెంకట్రమణ, రేణుక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వేరుశనగ పైరును పరిశీలిస్తున్న జేడీఏ చంద్రానాయక్

డ్రమ్ములు, పట్టలు పంపిణీ..

ఓబులవారిపల్లె: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా చిన్నఓరంపాడు రైతు సేవా కేంద్రంలో టీడీపీ నాయకురాలు ముక్కా శిరీషారెడ్డి గురువారం ఎస్సీ కార్పొరేషన్ మం జూరు చేసిన డ్రమ్ములు, పట్టలు రైతులకు పంపిణీ చేశారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిలిపి వేసి, కషాయాలు తయారు చేసుకుని వాడుకోవడం వల్ల ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉంటారన్నారు, అందుకు సంబంధించిన విత్తనాలు కిట్‌ను గతంలో ఇచ్చామని జడ్పీఎన్ఎస్ సభ్యులు బుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్దమ్మ కుమారుడు పెంచలయ్య, టీడీపీ నాయకులు నాగేంద్ర నాయుడు, గజేంద్ర నాయుడు, నిఖిల్, జడ్పీఈఎస్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

సిద్దవటం: సిద్దవటం మండలం టక్కోలు రైతు సేవా కేంద్రంలో గురువారం ఏడీఏ నాగరాజు, ఏవో రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలంబడిపై రైతులకు అవగాహన కల్పించారు. 14 వారాల పాటు ఈ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమగ్రసస్యరక్షణతో అధిక దిగుబడులు

లక్కిరెడ్డిపల్లె ఆగస్టు 8: మండలంలోని గంగనపల్లెలో ఏడీఏ జయరాణి మాట్లాడుతూ చీడపీడల నివారణకు రసాయనిక పురుగుమందులు వాడకంతో పాటు సేంద్రియ ఎరువులు, కషాయాలు పంటలకు ఉపయోగించుకోవచ్చునన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది ప్రకృతి ఎరువులు, కషాయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు అనూష, నాగరాజు, రైతుభరోసా కేంద్రాల సిబ్బంది రైతులు,పాల్గొన్నారు

'ప్రకృతి సాగు' పొలాల్లో మెక్సికో ప్రొఫెసర్


సేంద్రియ ఎరువుల తయారీ గురించి మెక్సికో ప్రొఫెసర్ లాజస్‌కు వివరిస్తున్న రైతు కృష్ణమూర్తి

మెక్సికో దేశానికి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ఎలీనా లాజస్ గురువారం కుప్పం మండలంలోని శీగలపల్లెలో ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలను పరిశీలించారు. ఏ గ్రేడ్ పద్ధతిలో కూరగాయల సాగు విధానం, యూనివర్సల్ మోడల్‌లో సాగవుతున్న వేరుశనగ పంటను జి.కృష్ణమూర్తి పొలంలో చూశారు. ఎన్‌పీఎం షాప్ వద్ద తులనుపరిశీలించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. సాగులో తాను అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతు కృష్ణమూర్తి ఆమెకు వివరించారు. ప్రొఫెసర్ లాజస్‌కు జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు, ఎస్పీఎం సురేంద్ర, వ్యవసాయ పరిశోధకురాలు పుష్ప, ఏడీపీఎం శ్రీనివాసులు ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. ఎన్ఎఫ్ఏ గురుప్రసాద్ పాల్గొన్నారు.

- కుప్పం

వరసిద్ధుడి సేవలో సినీ నటుడు

కాణిపాకం(ఐరాల), ఆగస్టు 8: వరసిద్ధి వినాయకస్వామిని గురువారం సినీ నటుడు సంతోష్ శోభన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ వారికి దర్శన ఏర్పాట్లు చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

రూ.11 కోట్లతో ఉద్యాన పంటల ప్రోత్సాహకాలు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 8: జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం రూ.11 కోట్ల ప్రోత్సాహక నిధులను ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సమీకృత ఉద్యాన అభివృద్ధి మిషన్ (ఎండీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై), జాతీయ వంట నూనెల మిషన్, ఆయిల్ ఫామ్, కొబ్బరి అభివృద్ధి పథకం కింద మామిడి, చీని, దానిమ్మ, జామ, అరటి, బొప్పాయి, చింత, నేరేడు ముంతమామిడి, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఫిగ్, ఫాషన్ ఫ్రూట్ సాగుకు 40 శాతం సబ్సిడీ అందించనుంది. 668.60 హెక్టార్లలో పాలీ హౌస్‌లకు రూ.1.98 కోట్లు కేటాయించింది. చిన్న ట్రాక్టర్లు, టిల్లర్లు, ట్రాక్టర్‌తో నడిపే స్ప్రేయర్లు తదితర పరికరాలను 40-50 శాతం సబ్సిడీపై ఇచ్చేందుకు రూ.13.87 కోట్లు కేటాయించింది. కోల్డ్ రూంల ఏర్పాటుకు రూ.3.54 కోట్లు, పూల తోటల సాగుకు రూ.72 లక్షలు, కూరగాయల సాగుకు రూ.8 లక్షలు, నగరి, నింద్ర, కార్వేటినగరం, విజయపురం, ఎస్‌ఆర్ పురం, జీడీ నెల్లూరు మండలాల్లో 300 హెక్టార్లలో రూ.72 వేల సబ్సిడీతో ఆయిల్ ఫారం ఏర్పాటు చేయనుంది. బిందు, తుంపర్ల సేద్యానికి 70-90 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఉద్యాన పంటల సాగు అభివృద్ధి చేయాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదనరెడ్డి జిల్లా రైతాంగాన్ని కోరారు.

పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, ఆగస్టు 8: పీఎం విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా 5 శాతం వడ్డీకే రూ.3 లక్షల వరకు రుణం అందే అవకాశం ఉందని తెలిపారు. వడ్రంగి, స్వర్ణకారులు, కుమ్మరి, కమ్మరి, శిల్పులు, రాతి, తాపీ పనివారు, బుట్టలు, చాపలు, చీపుర్లు, తాళ్లు అల్లేవారు, సంప్రదాయ బొమ్మలు చేసేవారు, క్షురకులు, పూలదండలు చేసేవారు, లాండ్రీ, చేపల వలలు, పనిముట్లు, తాళాలు తయారు చేసేవారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సచివాలయాలు, సీఎస్‌సీ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెద్దిరెడ్డిపై అనర్హత కేసు 14కు వాయిదా

పుంగనూరు, ఆగస్టు 8: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో 142 ఆస్తుల వివరాలు పొందుపరచక పోవడంతో అనర్హుడిగా ప్రకటించాలని హైకోర్టులో దాఖలైన కేసు విచారణ ఈనెల 14కు వాయిదా పడింది. గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ కేసు విచారణను 14కు వాయిదా వేసినట్లు పిటీషనర్ బీసీవైపార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ తెలిపారు.

'మెప్మా'కు కొత్త సిబ్బంది

- 'డాయ్ యాప్'తో 19 మంది తొలగింపు పర్యవసానం


మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు కలెక్టర్ ఉత్తర్వులు అందజేస్తున్న ఉద్యోగులు

పలమనేరు, ఆగస్టు 8: 'డాయ్ యాప్' కేసులో పలమనేరులోని మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బంది, 14 మంది ఆర్పీలను తొలగించారు. కాగా, కార్యాలయ నిర్వహణ కోసం తాత్కాలికంగా తిరుపతి మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ మధుసూదన్, సీవో ధనలక్ష్మిని నియమించారు. రెగ్యులర్ సిబ్బంది నియామకం జరిగే వరకు వీరు ఇక్కడే కొనసాగనున్నారు. వీరిద్దరితో పాటు గురువారం తిరుపతి మెప్మాకార్యాలయంలో పనిచేసే సీనియర్ అసిస్టెంట్ పి. శ్రీనివాసులు కూడా ఇక్కడికి వచ్చారు. పలమనేరు కార్యాలయానికి ఇన్‌చార్జిగా నియమితులైన వి.బాబా ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా, 19 మందిని విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరు జారీ చేసిన ఉత్తర్వులను గురువారం వారికి అందజేశారు. ఇందులో పలమనేరు మెప్మా సిటీ మేనేజర్ ఉమేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేష్, కార్యాలయ సిబ్బంది మయూరి, జయంతి, గుల్షన్‌లతో పాటు ఆర్పీలు వలర్మతి, లక్ష్మీదేవి, బేబి, రాణి, జరీంతాజ్, శిరీష, ప్రసన్నకుమారి, పుష్పలత, రెడ్డెమ్మ, విమల, జయలక్ష్మి, నగీనా, దివ్య, ఎడీన ఉన్నారు.

2040లో చంద్రుడి మీదకు అతి తక్కువ ఖర్చుతో తీసుకెళ్తాం

అంతరిక్ష వారోత్సవాల్లో ఇస్రో చైర్మన్ సోమనాథ్



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు అందజేసే ముందు రాకెట్ నమూనా మెమెంటోను ప్రదర్శిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి, ఆగస్టు 8: అతి తక్కువ ఖర్చుతో 2040లో మనుషులను చంద్రుడి మీదకు తీసుకెళ్ళేందుకు పరిశోధనలు చేస్తున్నట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ తెలిపారు. చంద్రగిరి మండలం, ఎ.రంగంపేటలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అంతరిక్ష వారోత్సవాల్లో గురువారం నేషనల్ స్పేస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ముఖ్య అతిధిగా హాజరైన సోమనాథ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చంద్రయాన్ విజయవంతం కావడంతో అంతరిక్షరంగంలో దేశం ప్రతిష్ట పెరిగిందన్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వెళ్లడానికి విమానంలో 30 గంటల సమయం పడుతుందని, అయితే రాకెట్‌లో 30 నిమిషాల్లో చేరేందుకు అమెరికన్ ఇంజనీర్,టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ ప్రయోగాలు జరుపుతున్నారన్నారు.ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు మాట్లాడుతూ ఇస్రో చైర్మన్ సోమనాథ్ యువ శాస్త్రవేత్తలకు ఆదర్శనీయుడంటూ కొనియాడారు. ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు మాట్లాడుతూ ఇస్రో, ఎన్ఏఆర్ఎల్ సహకారంతో ముందుకెళతామన్నారు.షార్ డైరెక్టర్ రాజరాజన్, ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ అమిత్ కుమార్ పాత్ర, ఎంబీయూ వైస్‌ఛాన్సలర్ నాగరాజరామారావ్, రిజిస్ట్రార్ సారధి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో టీచర్ల పనిసర్దుబాటు

నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం ● ఆదివారానికి పూర్తి చేయాలని లక్ష్యం ● 500 పాఠశాలల్లో జరిగే అవకాశం



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 8: పాఠశాల విద్యా వ్యవస్థలో టీచర్ల పని సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) ప్రక్రియకు ప్రభుత్వం అడుగులు వేసింది. శుక్రవారం నుంచి ప్రక్రియ ప్రారంభించి ఆదివారంతో ముగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వీటి పరిశీలన నిమిత్తం డీఈవో, డీవైఈవో, ఏడీలను పరిశీలకులుగా నియమించింది. ఎక్కడా అవినీతికి తావులేకుండా పీపుల్- టీచరు రేషియో (పీటీఆర్)లో 2024 ఆగస్టు 7వ తేదీ యూడైస్ ఆధారంగా ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, పీడీ, పీఈటీల పని సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ నుంచి హైస్కూల్ ప్లస్ పాఠశాలలను మినహాయించారు. కాగా, జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యానికి సంబంధించి ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ఏపీ మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పరిధిలో 2463 పాఠశాలలున్నాయి. 35 ప్రభుత్వ, 2331 జడ్పీ, ఎంపీపీ, 53 మున్సిపల్ పాఠశాలల్లో మాత్రమే వర్క్ అడ్జస్ట్మెంట్ చేపట్టనున్నారు. 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలా చేపట్టాల్సిన ఈ ప్రక్రియలో కేవలం 500 పాఠశాలల్లో వర్క్ అడ్జెస్ట్మెంట్ జరిగే వీలుందని విద్యాశాఖ అధికారుల అంచనా.

ఈ కేటగిరిలకు మినహాయింపు

2025 ఏప్రిల్ 30 నాటికి పదవీ విరమణ పొందే వారితో పాటు వితంతు, పెళ్లికాని మహిళా టీచర్లు, విడాకులు తీసుకున్న వారు, భార్యభర్తలు ఒకే చోట పనిచేస్తున్న కేటగిరి టీచర్లకు వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియ నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరు ఇష్టపూర్వకంగా సర్దుబాటుకు అంగీకరిస్తే వారి పరిధిలోని పాఠశాలలకు వెళ్లే వీలు కల్పించారు.

మూడు దశల్లో ప్రక్రియ

శుక్రవారం మండల స్థాయిలో ఎంఈవోలు, శనివారం డివిజన్ స్థాయిలో డీవైఈవో, ఆదివారం జిల్లా స్థాయిలో డీఈవో ఆధ్వర్యంలో ఈ సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. టీచర్లు అధికంగా ఉన్నవారిని గుర్తించి రాష్ట్ర పాఠశాల వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. మండల స్థాయిలో వారిని పిలిపించి వెబ్ ఆప్షన్‌ల మేరకు టీచర్లు అవసరమైన పాఠశాలల ప్రదర్శించి, స్థానాలు ఎంపిక చేసుకునే వెసులుబాటును టీచర్లకు కల్పించారు.

సర్దుబాట్ల ప్రాధాన్యత

సబ్జెక్టుల వారీగా ఉన్నత పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లను, 98 మంది విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు, 3-8 తరగతులు రెండు భాగాలుగా విభజించి సబ్జెక్టుల వారీగా టీచర్ల సర్దుబాటు చేయాలి. అధికంగా ఉన్న టీచర్లను గుర్తిస్తే సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలలకు అవసరమైన చోట సర్దుబాటు చేయాల్సి ఉంది.

ఇన్‌చార్జిల నియామకం

వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియను సమర్థంగా నిర్వహించడానికి పాఠశాల విద్యాశాఖ రెవెన్యూ డివిజన్ల వారీగా ఇన్‌చార్జిలను నియమించింది. చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 10 మండలాలతో పాటు కుప్పం పరిధిలోని నాలుగు మండలాలకు డీవైఈవో చంద్రశేఖర్ ఇన్‌చార్జిగా ఉంటారు. నగరి రెవెన్యూ డివిజన్‌లోని ఏడు మండలాలకు డీఈవో దేవరాజు, పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని 10 మండలాలకు డీఈవో కార్యాలయ ఏడీ వెంకటేశ్వరరావు ఇన్‌చార్జిలుగా వ్యవహరించనున్నారు.

రూ.70 లక్షల విలువైన 330 ఫోన్ల రికవరీ


బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 8: చాట్‌బాట్ ద్వారా రికవరీ చేసిన రూ.70 లక్షల విలువ చేసే 330 ఫోన్లను ఎస్పీ మణికంఠ గురువారం బాధితులకు అందించారు. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో చాలా మంది ఫోన్లను పోగొట్టుకుని బాధితులు స్టేషన్లలో, చాట్‌బాట్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేశారు. చాట్‌బాట్ బృంద నిపుణులు మొబైల్ ట్రాకింగ్ ద్వారా ఫోన్లను పట్టుకున్నారు. రాష్ట్రంలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి ఫోన్లను రికవరీ చేశారు. వాటిని గురువారం పోలీసు అతిథి గృహంలో ఎస్పీ మణికంఠ బాధితులకు అందించారు.ఇప్పటివరకు మొదటి దశలో 500, రెండో దశలో 200, మూడవ దశలో 300, నాలుగవ దశలో 200, ఐదవ దశలో 300, ఆరవ దశలో 200 ఫోన్లను, తాజాగా 330 ఫోన్లతో కలిపి రూ.4.30 కోట్ల విలువ చేసే 2,030 ఫోన్లను రికవరీ చేసినట్లు వివరించారు. ఏఎస్పీ అరీఫుల్లా, క్రైమ్ సీఐ రామాంజినేయులు, చాట్‌బాట్ సిబ్బంది బాషాజీ, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

కైలాస ధామం నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం

- నిర్మాణానంతరమూ సాయమందిస్తానన్న గల్లా రామచంద్రనాయుడు


కైలాస దామాన్ని పరిశీలిస్తున్న రామచంద్రనాయుడు

చిత్తూరు రూరల్, అగస్టు 8: నగరంలోని శ్మశానవాటికలో నగరపాలక సంస్థ సహకారంతో లయన్స్ క్లబ్, ఆర్య వైశ్య సంఘం సంయుక్తంగా నిర్మిస్తున్న కైలాస ధామ(బర్నింగ్ మిషన్)నికి బుధవారం అమరరాజ సంస్థల మాజీ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. విరాళంతో సరిపెట్టకుండా నిర్వాహణ ఖర్చులకు సహాయం అందిస్తానని తెలిపారు. చిత్తూరు జిల్లా అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం కైలాస ధామంతా కలియదిరిగి నిర్వాహకులను అభినందించారు. లయన్స్ గోల్డ్ జోనల్ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి మాట్లాడుతూ కైలాసధామం నిర్మాణంలో రామచంద్రనాయుడు భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీధరరెడ్డి, ద్వారకనాథ్, శరవణ, వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.

దాతలూ.. ప్రాణం నిలపరూ

బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న టీడీపీ బూత్ కన్వీనర్ మురళి ● రూ.14 లక్షలు ఖర్చువుతుందన్న వైద్యులు


సీఎంసీలో చికిత్స పొందుతున్న మురళి

చిత్తూరు రూరల్, ఆగస్టు 8: దాతలూ.. సాయం అందించి ప్రాణం నిలపాలని కోరుతున్నారు మురళి. ఈయనది చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు గ్రామం. టీడీపీ బూత్ కన్వీనర్. రెక్కాడితేనే కానీ డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. ఇటీవల చిత్తూరు మార్కెట్‌కు వస్తుండగా కళ్ళుతిరిగి పడిపోయారు. మరో రెండు రోజుల తర్వాత చేతులు, కాళ్లు లాగేస్తున్నట్లు అనిపించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యులను సంప్రదించారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్నాయని.. వీటికి సంబంధించి రక్తపరీక్షలకు సీఎంసీకి వెళ్లాలని వైద్యులు సూచించారు. రాణిపేటలోని సీఎంసీలో పరీక్షలు చేయించగా బ్లడ్ క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. రెండో స్టేజ్‌లో ఉందని, వైద్యం చేస్తే బతుకుతాడని ఇందుకు రూ.14 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తేల్చారు. పనిచేస్తే కానీ కుటుంబానికి అన్నం పెట్టలేని పరిస్థితి తనది. తనతో పాటు భార్య ఇద్దరు ఆడపిల్లలు, తల్లిదండ్రులను పోషించాలి. క్యాన్సర్ కావడంతో ఆలస్యం చేయకుండా అక్కడక్కడ అప్పులుచేసి వైద్యం కోసం సీఎంసీలో చేరారు. కుటుంబ సభ్యులు శక్తికి మించి అప్పులు చేసి రూ.4 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇక ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలిసి టీడీపీ నేత చంద్రప్రకాష్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మరింత మంది దాతలు సాయం అందించాలని సోషల్ మీడియాలో అభ్యర్థించారు. దాతలు ముందువస్తే మురళి ప్రాణం నిలబడుతుందని ఆయన తెలిపారు.

వైసీపీ నేతల చెరనుంచి చెన్నెని చెరువుకు విముక్తి


చెన్నెని చెరువును సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు


చెరువు ఆక్రమిత భూమిలో ఎక్స్‌కవేటర్‌తో కందకం తవ్వుతూ...

గుడుపల్లె, ఆగస్టు 8: గుడుపల్లె మండలం గుండ్లసాగరంలోని చెన్నెని చెరువు ఆక్రమిత భూమికి గురువారం విముక్తి లభించింది. గుండ్లసాగరం సమీపంలోని సర్వే నెం.157లో 14.74 ఎకరాల్లో చెన్నెని చెరువు ఉంది. దీనిపై వైసీపీ నేతలు, కొందరు గ్రామస్తుల కన్నుపడింది. కుప్పానికి చెందిన వైసీపీ నాయకుల అండతో చెరువు భూమిని 12 ఎకరాల వరకు ఆక్రమించేశారు. ఆక్రమిత భూమిలో కొందరు మామిడి, నేరేడు, కొబ్బరి తోటలతో పాటు వివిధ రకాల పంటల సాగు చేపట్టారు. కొన్నేళ్లుగా గ్రామస్థులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కుప్పం వైసీపీ నాయకుల జోక్యంతో రెవెన్యూ అధికారులు ఈ ఫిర్యాదులను చెత్తబుట్టలో పడేశారు. చెరువు ఆక్రమణతో నీరు నిల్వ లేకుండా పోయింది. దీంతో ఆయకట్టుదారులు భూములను బీడుగా ఉంచేశారు. దీనిపై జూలై 21వ తేదీన 'చెరువును చెరబట్టారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టరు సుమిత్ కుమార్ స్పందించారు. ఆక్రమిత చెరువును సర్వే చేసి ట్రెంచ్‌ను

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పాటు చేయాలని తహసీల్దారును ఆదేశించారు. దీంతో గురువారం రెవెన్యూ అధికాల బృందం చెన్నెని చెరువుకు చేరుకొన్నారు. ఆక్రమణదారులు అడ్డుకోవడానికి సిద్ధపడ్డారు. సర్వేకు అడ్డుతగిలితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో వారు వెనకడుగు వేశారు. గుండ్లసాగరం సర్వేయర్ జయంత్, వీఆర్‌వో కుమార్, వీఆర్‌ఏలతో చెరువును సర్వే చేశారు. సుమారు 12 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. ఆక్రమిత చెరువు భూమిలో ఎక్స్‌కవేటర్‌తో కందకాలను సర్పంచ్ నాగరాజు తవ్వించారు. ఎట్టకేలకు వైసీపీ నాయకుల చెర నుంచి చెన్నెని చెరువు భూమి విముక్తి కలగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

సొంత డబ్బుతో సెక్యూరిటీ పెట్టుకోవచ్చుగా!

జగన్‌ను ప్రశ్నించిన మాజీ ఎంపీ చింతా మోహన్

అమరావతి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్ల అధికారంలో ఉన్న ఒక కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించిందని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆరోపించారు. గురువారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ వేల కోట్ల రూపాయలున్న జగన్ సొంతంగా సెక్యూరిటీని పెట్టుకోవచ్చు కదా! అని ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి తన సెక్యూరిటీ కోసం రూ.100 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. తమకెవరికీ సెక్యూరిటీ లేదని.. తాము బయట తిరగడం లేదా అని అడిగారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి వైఎస్సార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, జగన్, చంద్రబాబు ఎంత ఖర్చు చేశారో బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు


పూల రమేష్

చిత్తూరు లీగల్, ఆగస్టు 8: చిన్నారిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడికి చిత్తూరు న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. మదనపల్లె చంద్రకాలనీకి చెందిన పూల రమేష్ భిక్షమెత్తుకుంటూ కాలం గడపుతున్నాడు. అక్కడే నివాసముంటున్న భాగ్యమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమెకు మూడేళ్ల కుమార్తె ఉంది. తమ ఆనందానికి అడ్డు వస్తుందనే కోపంతో 2017 ఏప్రిల్ 20వ తేదీన ఆ చిన్నారిని హత్య చేయడానికి ప్రయత్నించాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు మదనపల్లె పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. గురువారం పోక్సో కోర్టులో జరిగిన విచారణలో నేరం రుజువుకావడంతో రమేష్‌కు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పునిచ్చారు.

ఉద్యోగాల పేరిట మోసం చేసిన మహిళకు రెండేళ్ల జైలు


నిర్మల

చిత్తూరు లీగల్, ఆగస్టు 8: ఉద్యోగాల పేరిట పలువురి వద్ద నగదు కాజేసిన మహిళకు కోర్టు రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధించింది. శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు చెందిన సిద్ధయ్య భార్య నిర్మల ఉద్యోగాలు తీసిస్తానని చెప్పి జిల్లాలోని పలువురు యువకుల నుంచి డబ్బు వసూలు చేసింది. దీనిపై 2020లో చిత్తూరు క్రైమ్ పోలీసు స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఆ మహిళను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఐదవ కోర్టులో గురువారం విచారణకు రాగా నిర్మలపై నేరం రుజువుకావడంతో రెండేళ్ల జైలు శిక్ష, రూ. ఐదువేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కీర్తన తీర్పు చెప్పారు.

ఆగని ఏనుగుల విధ్వంసం


ఏనుగుల దాడితో ధ్వంసమైన వరి నార్లు

సోమల, ఆగస్టు 8: పేటూరు పంచాయతీలో బుధవారం రాత్రి ఏనుగుల స్వైర విహారంతో పొలాల్లోని వరి నార్లు ధ్వంసమయ్యాయి. దీంతో పొలాల వద్దకు వెళ్లడానికి రైతులు భయాందోళన చెందుతున్నారు. నాట్లకు సిద్ధంగా ఉన్న వరినార్లు ధ్వంసం కావడంతో వీరంతా దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నీలంకాయల కోతలకు సిద్ధంగా ఉన్న మామిడి చెట్లను ధ్వంసం చేయడంతో నష్టపోయామని చిన్నకంపల్లెకి చెందిన బాలాజీనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారులకు బాధిత రైతులు గురువారం ఫిర్యాదు చేశారు. నష్ట పరిహారం అందజేయాలని ఉద్యానశాఖ అధికారులను వారు కోరుతున్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతం


వివేకానంద మున్సిపల్ హైస్కూల్ కమిటీ అధ్యక్షులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు


పీటీఎం ఆదర్శ పాఠశాలలో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లను సన్మానిస్తున్న దృశ్యం


గుర్రంకొండ హైస్కూల్లో ఎస్ఎంసీ చైర్మన్‌తో టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు


తంబళ్లపల్లె మోడల్ స్కూల్లో ఎస్ఎంసీ ఎన్నిక నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్

మదనపల్లె అర్బన్, ఆగస్టు8: మండల పరిధిలోని 137 పాఠశాలలు ఉండగా 136 పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మిగిలిన బసినికొండ జడ్పీ హైస్కూల్ ఎన్నికలు నిర్వహించలేదన్నారు. గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు పలువులు అభినందించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ పాఠశాల కమిటీ అధ్యక్షురాలుగా చంద్రకళ ఎన్నిక కాగా జడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ అధ్యక్షుడుగా మహమ్మద్ ఎన్నికయ్యారు. నీరుగట్టువారిపల్లెలోని రామిరెడ్డి లేవుట్‌లో ఉన్న వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల కమిటీ అధ్యక్షుడుగా భోజనపు వెంకటభాగ్యలక్ష్మీ, ఉపాధ్యక్షుడుగా బాలాజీ నాయక్ ఎన్నికయ్యారు. ఆయా పాఠశాలల్లో కమిటీ సభ్యులకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు 34వ వార్డు ఇన్‌చార్జి బొమ్మిశెట్టి పురుషోత్తం, జేసీబీ మధు, యర్నబల్లి వెంకటరమణారెడ్డి, హెచ్ఎం షాజహాన్, బాబీ, హెచ్ఎం సుబ్బారెడ్డి, హెచ్ఎం రాజేంద్రబాబు, ఉపాధ్యాయుడు ఆర్వి రమణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రంలో: మండలంలో గురువారం నిర్వహించిన పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈవో హేమలత తెలిపారు. మండలంలో మొత్తం 80పాఠశాలలు ఉండగా అందులో ప్రాథమికోన్నత పాఠశాలలు 12, ఉన్నత పాఠశాలలు 5, ఒక కస్తూరిబా పాఠశాల, ఒక ఆదర్శ పాఠశాల, 51 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అన్నింటిలో గురువారం జరిగిన ఎన్నికలలో అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆమె తెలిపారు. ఇందులో ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా బాలాజి, కస్తూరిబా పాఠశాల అధ్యక్షురాలుగా సరస్వతి, రామసముద్రం ఉన్నత పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా ఆర్.చాన్‌బాషా, మట్లవారిపల్లె ఉన్నత పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా కృష్ణప్ప, కేసీపల్లె ఉన్నత పాఠశాల అధ్యక్షుడిగా రెడ్డెప్పరెడ్డి, అరికెల ఉన్నత పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా భువనేశ్వర్‌రెడ్డి, చెంబకూరు ఉన్నత పాఠశాల కమిటీ అధ్యక్షుడిగా శంకరప్ప ఎన్నికైనట్లు ఎంఈవో తెలిపారు. ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించడానికి సహాయసహకారాలు అందించిన పిల్లల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, ప్రజా ప్రతినిధులకు ఎంఈవో హేమలత కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరగడానికి కృషి చేసిన నాయ కులు, కార్యకర్తలకు మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎన్నికైన కమిటీ అధ్యక్షులకు శుభాకాంక్షులు తెలిపారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని 54 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 6 జడ్పీఉన్నత పాఠశాలలు, ఒక్క మోడల్ స్కూల్, ఒక్క కస్తూరిబా పాఠశాలల్లో స్కూల్ మేనేజమెంట్ కమిటీలకు అన్ని చోట్ల ఏకగ్రీవంగా ఎన్నిక జరిగినట్లు ఎంఈవో నారాయణ పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో రిజర్వేషన్ల ప్రకారం పాఠశాలల్లో తరగతుల వారీగా సభ్యులను ఎన్నుకున్నారు. బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎం. జయచంద్రారెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎం. ఉషారాణి, కమ్మచెరువు ఉన్నత పాఠశాలకు చైర్మన్‌గా జి. నారాయణస్వామి, వైస్ చైర్మన్‌గా టి. అలివేలమ్మ, కందుకూరు ఉన్నత పాఠశాలకు చైర్మన్‌గా ఎం. సుబ్బరాం, వైస్ చైర్మన్‌గా ఎస్. లక్ష్మీ, పీటీఎం ఉన్నత పాఠశాల చైర్మన్‌గా పీటీఎంకు చెందిన మల్యాకుల నరసింహులు, వైస్ చైర్మన్‌గా వై.కవిత, పీటీఎం ఉర్దూపాఠశాల చైర్మన్‌గా ఎల్ మహబూబ్‌బాషా, వైస్ చైర్మన్‌గా ఎస్ సల్మా, పులికల్లు ఉన్నత పాఠశాల చైర్మన్‌గా వి. అమరేంద్ర, వైస్ చైర్మన్‌గా కే. భూదేవి, రంగసముద్రం ఉన్నత పాఠశాల చైర్మన్‌గా దాసరి శంకర, వైస్ చైర్మన్‌గా చింతమాను శైలజ, టి.సదుం ఉన్నత పాఠశాల చైర్మన్‌గా జి. మహేంద్ర, వైస్ చైర్మన్‌గా జె. సుగుణ, పీటీఎం ఆదర్శ పాఠశాల చైర్మన్‌గా పీటీఎంకు చెందిన పూల బార్గవి, వైస్ చైర్మన్‌గా తుమ్మరకుంట పంచాయతీ పెద్దపొంగుపల్లెకు చెందిన కే. శ్రీనివాసులు, కస్తూరిబా పాఠశాల చైర్మన్‌గా వై..కేశవమ్మ, వైస్ చైర్మన్‌గా ఎ. మహేశ్వరిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈవో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అధ్వర్యంలో అయా పాఠశాలలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు.

నిమ్మనపల్లిలో:మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా జరిగినట్లు ఎంఈవో-1 పద్మావతి, ఎంఈవో-2 నారాయణ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ 58 ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలోనూ ఆధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ముఖ్యంగా స్థానిక జడ్పీహైస్కూల్ స్కూల్ కమిటీ అధ్యక్షునిగా క్రిష్ణయ్యను ఏకగ్రీంగా సభ్యలను ఎన్నుకొన్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి రెండేళ్ల పాటు వారు పదవిలో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురబలకోటలో: మండలంలోని 45పాఠశాలల్లో ఆయా పాఠశాల హెచ్ఎంలు కన్వీనర్‌లుగా వ్యవహరించి ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకుని వారి చేత ప్రమాణస్వీకారం చేయించారు. కాగా 38 పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకోగా 7పాఠశాలలో ఎన్నికలు నిర్వహించి ఎన్నుకున్నట్లు ఎంపికైన ఎంఈవో ద్వారకనాథ్ తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీసెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రుద్రబాలకృష్ణ పాల్గొన్నారు.

ములకలచెరువులో: ములకలచెరువు మండలంలో గురువారం జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 60 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీహైస్కూళ్లు, రెండు గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్‌లో ఎన్నికలు జరిగాయి. పలు పాఠశాలల్లో జరిగిన ఎన్నికలను ఎంఈవో వెంకటరమణ, ఎస్ఐ తిప్పేస్వామిలు పరిశీలించారు.

గుర్రంకొండలో:గుర్రంకొండ మండలంలో స్కూల్ మేనేజెమెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 48 ప్రాథమిక , 10 ప్రాథమికోన్నత , 8 ఉన్నత పాఠశాలలతోపాటు ఒక రెసిడెన్సియల్ పాఠశాలలకు గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో అన్ని పాఠశాలలకు ఎస్ఎంసీ చైర్మన్‌లుగా టీడీపీ మద్దతుదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, ప్రసాద్‌నాయుడు, మూర్తిరావు, నౌషాద్ అహ్మద్, హరిప్రసాద్‌నాయుడు, చలమారెడ్డి, చంద్రబాబు, ఎల్లుట్ల మురళీ, సుంకశేఖర్, చలపతి, ప్రదీప్, బయ్యారెడ్డి, వెంకటరమన, ప్రకాశ్, క్రాంతి, నాగేంద్ర, జయసూరి, మహాత్మారెడ్డి, సుధాకర్, రామ్, ఆనంద్, రెడ్డిశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:మండలంలో గురువారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో మునీంద్రనాయక్ తెలిపారు. మొత్తం 52 పాఠశాలలకు గానూ 51 చోట్ల చైర్మన్, వైస్ చైర్మన్లు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వారి చేత ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రమాణ స్వీకారం చేయించారు. కాగా కలకడ ఆదర్శ పాఠశాలలో తగిన సంఖ్యలో తల్లిదండ్రులు హాజరు కాకపోవడంతో కోరం లేక ఎన్నిక వాయిదా పడిందని ఎంఈవో తెలిపారు. ఎన్నికల ను ఎంఈవో-2 రామచంద్రారెడ్డి పర్యవేక్షించగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రామకృష్ణారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.


రామసముద్రం ఆదర్శ పాఠశాలలో కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బాలాజిని అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలలో 57 పాఠశాలలో చైర్మన్ వైస్ చైర్మన్ లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మండలంలోని పెద్దమండ్యం మోడల్ స్కూల్, పాపేపల్లి గ్రామ పంచాయతీ యల్లంవారిపల్లి హైస్కూల్, కలిచెర్ల హైస్కూలల్లో కోరం లేక ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈవో మనోహర్ వెల్లడించారు. కాగా పెద్దమండ్యం హైస్కూల్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా టి. సునిత, వైస్ చెర్మన్ గా నగీన్ బాషా, కలిచెర్ల ఉర్దూ హైస్కూల్ చైర్మన్‌గా సయ్యద్ షమీవుల్లా, వైస్ చైర్మన్‌గా ఎస్. అయిషా, వెలిగల్లు హైస్కూల్ చైర్మన్‌గా డి. మాధవకుమార్, వైస్ చైర్మన్‌గా ఎస్ రేష్మా, సిద్దవరం కస్తూర్బా బాలికల పాఠశాల చైర్మన్‌గా కె. కళావతి, వైస్ చైర్మన్ గా బి.రుక్మిణిలను ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్లు ఎంఈవోలు తెలిపారు. ప్రిన్సిపాల్‌లు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ములకలచెరువు సీఐ మధు బందోబస్తు నిర్వహించారు.

కలికిరిలో: కలికిరి మండలంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలు సజావుగా ముగిశాయి. మండలంలోని మొత్తం 64 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. 54 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలతోపాటు జ్యోతీబాపూలే బాలికల గురుకుల పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. మండలంలో అన్ని చోట్ల జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎంఈవో కరీముల్లా తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణయ్య, తహసీల్దారు మహేశ్వరీ బాయి ఎన్నికల తీరుతెన్నులను పరిశీలించారు. బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ సోమశేఖర్ ఎన్నికల అధికారిగా పాల్గొన్నారు. సీఆర్పీలు సురేష్, వీఆర్వోలు, పధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో:తంబళ్లపల్లె మండలంలో 68 ప్రభుత్వ పాఠశాలలుండగా.. 66 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు సజావుగా జరిగినట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆయా హెచ్ఎంల ఆధ్వర్యంలో యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. కన్నెమడుగు హైస్కూల్, ఎద్దులవారికోట ప్రైమరీ స్కూల్‌లో పలు విబేదాలతో కోరం లేక ఎన్నిక వాయిదా పడినట్లు తెలిపారు. కాగా, తంబళ్లపల్లె మోడల్ స్కూల్ చైర్మన్‌గా వాణిశ్రీ, వైస్ చైర్మన్‌గా ఎస్.గులాం, తంబళ్లపల్లె హైస్కూల్ చైర్మన్‌గా ఎస్.శివకుమార్, వైస్ చైర్మన్‌గా ఇ.రెడ్డమ్మ, కేజీబీవీ పాఠశాల చైర్మన్‌గా మల్లీశ్వరీ, ఎంపీయుపీ స్కూల్ చైర్మన్‌గా వి.ఆనంద్, వైస్ చైర్మన్‌గా పి.నందిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయా కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బేరిశీన, సోముశేఖర్, పురుషోత్తం, కాలానారాయణ, ఉత్తమ్‌రెడ్డి, నరసింహులు, సుధాకర్‌రెడ్డి, శేఖర, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.


కురబలకోటలో ఎన్నికైన నూతన కమిటీ


ములకలచెరువులో ఎన్నికలు పరిశీలిస్తున్న ఎంఈవో వెంకటరమణ, ఎస్ఐ తిప్పేస్వామి


కలికిరి బాలికోన్నత పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి


ప్రభుత్వాస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 8: మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. గత ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదని కార్మికులు ధర్నా నిర్వహించారు. గురువారం స్థానిక ఆస్పత్రి ఆవరణలో జరిగిన ధర్నాలో కార్మికులు మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు రాలేదని కాంట్రాక్టరు ప్రతినిధి శరత్‌యాదవ్‌కు ఫోన్ చేసినా ఆయన స్పందించలేదన్నారు. ఐదు నెలలుగా అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన దుస్థితిలో ఉన్నామన్నారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రతినిధి షంషీర్ ఆస్పత్రి వద్దకు చేరుకుని కార్మికులతో చర్చించారు. నాలుగు రోజుల్లోపు కార్మికులకు వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కార్మికులు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ శివరామ్‌ప్రసాద్, ఆర్ఎంవో ప్రసాదరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ఐటీయూసీ అధ్యక్షుడు జి.కృష్ణమూర్తి మద్దతు తెలిపారు.

సర్పంచ్‌ల విధులు, బాధ్యతలపై అవగాహన అవసరం

మదనపల్లె టౌన్, ఆగస్టు 8: గ్రామ పంచా యతీ సర్పంచ్‌ల విధులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో భానుప్ర సాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరా జ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) కేంద్ర ప్రభుత్వ పథకంపై మూడు రోజుల శిక్షణ ప్రారంభించా రు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సంయుక్తంగా పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకుల క్లోరినేషన్ తప్పని సరిగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో రెడ్డెమ్మ, ఇన్‌చార్జి ఈవోఆర్డీ శ్రీహరి, సర్పంచ్‌లు చిప్పిలి చలపతి, దీపా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలంలోని గుడిసెలు తొలగింపు


ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజీబీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు8: మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలో గురువారం రెవెన్యూ, పోలీస్ అధికారులు కలిసి ఆక్రమిత స్థలంలోని గుడిసెలను తొలగిం చారు. గత కొద్ది రోజులుగా ప్రభుత్వ స్థలంలో అమ్మచెరువుమిట్టకు చెందిన 12 మంది గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. కాగా తహసీల్దార్ ఖాజాబీ ఆక్రమణదారుతో మాట్లాడగా ప్రభుత్వం మాకు పట్టాలు మంజూరు చేసినా ఇళ్ల స్థలాలు చూపకపోవడంతో గుడిసెలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఇది ఆక్రమణలుగా గుర్తించిన తహసీల్దార్ గుడిసెలు తొలగించాలని సూచించారు. అయితే వారు వినకపోవడంతో పోలీసుల సహకారంతో గిడిసెలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బాధితులు లబ్ధిదారులగా ఉంటే పూర్తి వివరాలు అందజేయాలని కోరడంతోపాటు ప్రభు త్వం అందిస్తున్న లేవుట్లో ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, సర్వేయర్ సుబ్రమణ్యం, తాలుకా సీఐ శేఖర్, ఎస్ఐ వెంకటేష్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ క్లస్టర్ గేమ్స్ చాంపియన్‌గా చిత్తూరు


చిత్తూరు జట్టుకు ట్రోఫీలు అందిస్తున్న జేఎన్వీ అధ్యాపకులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 8: జవహర్ నవోదయ విద్యాలయ(జేఎన్వీ)లో నిర్వహించిన క్లస్టర్ గేమ్స్‌లో చిత్తూరు నవోదయ విద్యాలయ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. మదనపల్లె మండలం వలసపల్లె సమీపంలోని జవహర్ నవోదయ విద్యాలయలో రెండు రోజులుగా నిర్వహించిన క్లస్టర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌లో అనంతపురం, చిత్తూరు, కడప, కరైకల్, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం-1, ప్రకాశం-2, పుదుచ్చేరి జిల్లాలకు చెందిన 9 విద్యాలయాల విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. గురువారం హర్డిల్స్, రిలే పరుగుపందెం, ఐదు కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ, 5 కిలోమీటర్ల నడక పందేలు నిర్వహించగా చిత్తూరు జిల్లా జట్టు(మదనపల్లె నవోదయ విద్యాలయ) మొత్తం 451 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. 84 పాయింట్లతో ద్వితీయ స్థానం నెల్లూరు జేఎన్వీ, 67 పాయింట్లతో కడప జేఎన్వీ తృతీయ స్థానంలో నిలిచింది. క్లస్టర్ విజేతగా నిలిచిన చిత్తూరు జట్టు ఈనెల 12వ తేదీన మదనపల్లె జేఎన్వీలో మూడు రోజుల పాటు నిర్వహించే హైదరాబాద్ రీజనల్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ) స్థాయిలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ క్రీడా పోటీల్లో చిత్తూరు క్లస్టర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ టి.వేలాయుధన్, పీడీలు సురేంద్రరెడ్డి, కొరాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికను గాయపర్చిన నిందితుడికి ఏడేళ్లు జైలు శిక్ష

మదనపల్లె అర్బన్, ఆగస్టు 8:బాలికను గాయపరిచిన కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్షతోపాటు వెయ్యి రూపాయలు చిత్తూరు పోక్సో కోర్టు న్యాయాధికారి శాంతి విధించినట్లు పోలీసులు తెలిపారు. గురువారం నింధితున్ని కారాగారానికి తరలించారు. మదనపల్లె టూటౌన్ సీఐ యువరాజు కథనం మేరకు మదనపల్లె టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో . మదనపల్లె పట్టణం, చంద్రకాలనీకి చెందిన పుల్ల రమేష్ అలియాస్ తిరుపతి(41) ఇదే ప్రాంతానికి చెందిన మూడేళ్ల బాలికను గాయపర్చిన కేసులో అప్పటి దర్యాప్తు అధికారి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుమంత్ నాయక్ కేసు పూర్వ పరాలను విచారించి నిందితునిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ కేసును ఫిర్యాదు తరఫున వాదన వినిపించారు. దీంతో పూర్వ పరాలను పరిశీలించిన న్యాయాధికారి పుల్లరమేష్ అలియాస్ తిరుపతికి శిక్ష విధించారు. ఈ సందర్భంగా కోర్టు లైసెన్ ఆఫీసర్ అయిన హెడ్ కానిస్టేబుల్ రుషేంద్రబాబు, హరిబాబునాయక్, సాయి సుధాకర్, కానిస్టేబుల్ రెడ్డెప్పలను ఎస్పీ, మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు అభినందించినట్లు సీఐ తెలిపారు.

నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు

కురబలకోట, ఆగస్టు 8: విద్యార్థులు నైపుణ్యాలను ప్రదర్శిస్తే మెరుగైన ఉద్యోగావకాశాలు పొందవచ్చని రిసో ర్సుపర్సన్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అంగళ్ళు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళా శాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కొనాలి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రధానంగా ఒత్తిడులకు లోనవుతుంటారని, అలా కాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. ఎలక్ట్రానిక్ రంగంలో మెరుగైన ఉద్యోగావకా శాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్, విభాగాధిపతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తూ పట్టుబడ్డ వైసీపీ ఎంపీటీసీ భర్త

ములకలచెరువు, ఆగస్టు 8: మద్యం అక్రమంగా తరలిస్తుండడంతో వైసీపీ ఎంపీటీసీ రేష్మ భర్త కె.మహమ్మద్‌రఫీని గురువారం ఎస్ఈబీ పోలీసులు అరెస్టు చేశారు. ములకలచెరువు మండలం పాత ములకలచెరువు వైసీపీ ఎంపీటీసీ భర్త, వైసీపీ నాయకుడు మహమ్మద్‌రఫీ(34) మద్యం దుకాణంలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యం దుకాణంలో నుంచి పరిమితికి మించి మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా ఎస్ఈబీ సీఐ రామోహన్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా అతన్ని అరెస్టు చేసి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ములకలచెరువు నుంచి తంబళ్లపల్లెకు వెళ్లే మార్గంలో నిందితుడ్ని అరెస్టు చేశారు.

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు

మదనపల్లె అర్బన్, ఆగస్టు8: క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, డీఎస్పీ కొండయ్య నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థుల సమావేశంలో డీఎస్పీ, కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన యువత భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో రాణిస్తారని తెలిపారు. టూటౌన్ సీఐ యువరాజు మాదకద్రవ్యాల దష్పరిణామాల గురించి వివరించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టాభిషేక మహోత్సవాలకు నేడు అంకురార్పణ

వాల్మీకిపురం, ఆగస్టు 8: పట్టణంలో వెలసిన పట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పట్టాభిషేక మహోత్సవాలకు శుక్రవారం అంకురారర్పణ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు పేర్కొన్నారు. మూడు రోజుల పాటుగా ఉత్సవాలు భక్తులను అలరించనున్నాయి.

జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, ఆగస్టు 8: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి ఈనెల 20వ తేదీ వర కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి పేర్కొన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేష నల్ గ్రూపు లలో ప్రవే శానికి ఆస క్తి కలిగిన విద్యార్థులు సర్టిఫికెట్‌లతో నేరుగా కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

వాల్మీకిపురంలో ఓ ఉపాధ్యాయుడి నిర్వాకం

ఎస్ఎంసీ ఎన్నికలకు డుమ్మా.. ముందుగానే పేర్లు ప్రకటన

వాల్మీకిపురం, ఆగస్టు 8: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు అంతా నాఇష్టం అంటూ వ్యవహరించిన తీరు సర్వత్రా ఆగ్రహానికి గురిచేసింది. వాల్మీకిపురం పట్టణం ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని వెస్ట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం కమిటీ ఎన్నిక జరగాల్సి ఉండగా ఉదయం స్థానిక టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. అయితే ఆ పాఠశాలలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు తనకు నచ్చిన పేర్లు కమిటీలో రాసి పెట్టి వెళ్లిపోయాడు. దీనిపై వివరాలు ఆరా తీసిన టీడీపీ నాయకులు సదరు ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి పాఠశాల కమిటీ ఎన్నిక ఎవ్వరూ రాకముందే ఎలా చేస్తారని ప్రశ్నించగా దురుసుగా సమాధానమిచ్చాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీ నియామకం ఇష్టారాజ్యాంగ ఎలా చేస్తారని మండిపడ్డారు. అంతే కాక పిల్లల చేత చేతకాని పనులన్నీ చేయిస్తున్న ఆ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా వెస్ట్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్నం దాకా ఉన్న ఉపాధ్యాయుడు కమిటీ ఎన్నికల సమయాన లేకుండా పోవడం, హాజరు రిజిస్టర్‌లో గత రెండు రోజులుగా ఎందుకు సంతకాలు పెట్టలేదని నిలదీశారు. చివరికి టీడీపీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో పాఠశాల కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ విషయమై ఎంఈవో వెంకటరత్నంను వివరణ కోరగా మండలం మొత్తం పరిశీలన చేయాల్సి ఉన్నందున తన దృష్టికి రాలేదని తప్పక పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బొక్కసం రామకృష్ణ, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, రామాంజులురెడ్డి, కువైట్ సయ్యద్‌బాషా, రామచంద్ర, ఆనంద్, డిష్‌బ్రదర్స్, రెడ్డిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూములపై సబ్ కలెక్టర్ తనిఖీ

● తీగ లాగుతున్న రెవెన్యూ అధికారులు


సీటీఎం రెవెన్యూ గ్రామంలో ఫ్రీహోల్డ్ భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, ఆగస్టు 8: మదనపల్లె మండలంలో 22-ఏ భూములను ఫ్రీహోల్డ్ చేయడం, వాటి రిజిస్ట్రేషన్‌లు జరగడంపై మదనపల్లె సబ్ కలెక్టర్ దృష్టి పెట్టారు. మదనపల్లె మండలంలో 2,971 సర్వే నెంబర్లలోని 3,620 ఎకరాల 22-ఏ భూమిని 596 జీవో ప్రకారం వైసీపీ ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. ఈ క్రమంలో మదనపల్లె మండలంలో వైసీపీ నాయకులు మండలంలో పలుచోట్ల పేదల నుంచి విలువైన ప్రాంతాల్లో 22-ఏ భూములను గుర్తించారు. పేద రైతుల నుంచి, మధ్యతరగతి రైతుల వరకు సామ, దాన, దండోపాయాలతో ఈ భూములను కైవసం చేసుకోవడానికి వైసీపీ నాయకులు పావులు కదిపారు. ఇందులో భాగంగా 22-ఏ జాబితాలోని భూములను తమకే విక్రయించాలని ముందస్తుగా అగ్రిమెంట్లు చేసుకోవడంతో పాటు రెవెన్యూ అధికారుల సహకారంతో వందల ఎకరాల భూమిని 22-ఏ జాబితా నుంచి ఫ్రీహోల్డ్ పెట్టించి, అనంతరం వాటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకుల భూబాగోతం, అక్రమాలు, 22-ఏ భూముల నిషేధం ఎత్తివేయడంలో తహసీల్దార్, డీటీల ప్రమేయం లేకుండా ఫోర్జరీ సంతకాలతో ఆర్డీవో కార్యాలయానికి ఫైళ్లు పంపి అక్కడి నుంచి కలెక్టరేట్ ద్వారా ఫ్రీహోల్డ్ చేయించుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారి అక్రమాలు బయటపడతాయని భావించి సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దహనం చేయించారని అభియోగాలు ఉన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం డీజీపీ స్థాయి అధికారే స్వయంగా వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ కేసును సీఐడీకి బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు చేసిన నివేదికలను సీఐడీ అధికారులకు అప్పజెప్పారు.

తీగ లాగుతున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో జరిగిన భూదందాలు, 22-ఏ భూముల ఫైళ్ల రన్నింగ్‌లో జరిగిన అక్రమాలు గుర్తించేందుకు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా గురువారం మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ పరిధిలో సబ్‌కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ క్రమంలో సీటీఎం రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 1493/1, 1493/2, 1493/3 రికార్డులను పరిశీలించారు. ఫ్రీ హోల్డ్ రివెరిఫికేషన్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 8: అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్ చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గురువారం అక్ర మంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు తాలుకా పోలీసుస్టేషన్‌కు తరలించారు.

వైభవంగా నాగుల ప్రతిష్ఠ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 8: చిప్పిలి గ్రామంలోని యోగభోగేశ్వరాలయం(మడికయ్యల శివాలయం)లో నాగుల చవితిని పురష్కరించుకున గురువారం నాగుల ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు. టీడీపీ నేత మార్పూరి సుధాకర్‌నాయుడు కుటుంబసభ్యులు నాగుల విగ్రహాలను ఆలయానికి వితరణగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెద్ద ఎత్తున్న భక్తులు హాజరు కావడంతో ఎంతో విశిష్టత కలిగిన నాగుల ప్రతిష్ఠను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధదలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాల దాత మార్పూరిసుధాకర్ నాయుడు మాటాడుతూ ఎంతో ఘనచరిత్ర ఉన్న మడికయ్యల శివాలయంలో నాగుల విగ్రహాలను ప్రతిష్ఠించడం ఎంతో శుభపరిణామం అన్నారు. ప్రజల్లో భక్తిభావం పెంపొందించడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో శ్రీలత, డాక్టర్ మురళీధర్, డాక్టర్ శ్రీదేవి, విజయశ్రీ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.